సోమవారం
05-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 75
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏ కొండూరు...

మరో ఉద్దానం!

కిడ్నీ వ్యాధిబారిన తండా వాసులు

వైద్య కోసం ఆస్తులు పోగొట్టుకుని అప్పుల ఊబిలోకి

- కూలిపోతున్న కుటుంబాలు
- అధికారగణం తప్పుడు నివేదికలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ప్రభుత్వ వైఫల్యమేనంటున్న బాధితులు
- కలెక్టర్ రాకకోసం ఎదురుతెన్నులు

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం మరో ఉద్దానంగా మారుతోంది. ఐదేళ్లుగా గిరిజన తండాలు, గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డయాలసిస్, రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడండి మహాప్రభో అని మొత్తుకుంటున్నా మొద్దునిద్రపోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి ఇంటా కిడ్నీ బాధితుల మృత్యుఘంటికలు మోగుతుండడంతో తండాలనే ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. వారానికోరోజు ఏదో ఒక ప్రాంతంలో కిడ్నీ మృతుడి కట్టె కాలుతూనే ఉంది. వేలాది మంది వ్యాధిబారినపడి వైద్యం కోసం ఇల్లు, ఒళ్లు గుల్లచేసుకుంటున్నారు. ఆస్తులన్నీ పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండడంతో ప్రజలు అనారోగ్యం బారినపడి చివరిదశలో వైద్యుని సంప్రదించడంతో ఖర్చు భరించే శక్తి లేక మంచానపడి అటునుంచి అటే స్వర్గపురికి క్యూకడుతున్నారు. పెద్దదిక్కు కోల్పోయిన ఎన్నో కుటుంబాలు చేతిలో చిల్లిగవ్వలేక చిక్కి శల్యమౌతున్నాయి. డయాలసిస్ చేయించుకుంటున్నా ప్రాణాలు దక్కపోవడంతో అపోహలు, ఆర్థికలేమితో వ్యాధిగ్రస్తులను ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి వెనుకాడుతూ చావుకు ఎదురుచూస్తున్న తీరు కంటనీరు తెప్పిస్తోంది. కిడ్నీ బాధితులకు ప్రాణం పోయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని బాహాటంగా చెబుతున్నారు. ప్రభుత్వం పింఛన్ అందజేస్తూ చేతులు దులుపుకుంటుందని ఆవేదన వెళ్లగక్కారు. వ్యాధికి మూలాలు కనుగొని నిర్మూలించాల్సిన అధికారులు తప్పుడు నివేదికలిస్తుండడంతో వేలాది మంది వ్యాధిబారిన పడుతున్నారు... వందలాది మంది పిట్టల్లా రాలిపోతున్నారు.

2 లో

మట్టిఖర్చులైనా ఇవ్వలేదు

నా భర్త ధరవత్ రాజు. 35 ఏళ్లకే కిడ్నీ వ్యాధితో చనిపోయాడు. సీరమ్ క్రియాటిన్ లెవల్ 3.8 ఉందని వైద్యులు చెప్పారు. నిరక్షరాస్యత వల్ల ఏం చేయాలో తెలియలేదు. బతుకుతాడన్న ఆశతో రూ.3 లక్షల వరకు ఖర్చు చేశా. చివరికి దక్కకుండా పోయాడు. నాకు ఇద్దరు పిల్లలు... చదువుమాన్పించి బతుకుదెరువుకు కూలిపనులకు పంపుతున్నా. రెక్కాడితేగాని డొక్కాడని నేను వారిని ఎలా పోషించాలో అర్థంకావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. మట్టిఖర్చులైనా ఇప్పించండని పీహెచ్‌సీ వైద్యుని వద్దకు వెళ్తే, కిడ్నీ వ్యాధితో చనిపోలేదంటున్నారు. అధికారులే న్యాయం చేయాలి.

– ధరవత్ జ్యోతి, గొల్లమండల తండా

(ఫైల్ ఫోటో)

జగన్ సర్కార్‌కు షాక్!

ఉపాధ్యాయ దినోత్సవ బహిష్కరణ

- 'సీపీఎస్' ఉద్యోగుల నిర్ణయం
- ఉపాధ్యాయ సంఘాల సంఘీభావం
- కేసులు, నిర్బంధాలపై ఆగ్రహం
- 11న 'చలో విజయవాడ'కు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దుపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఉద్యమబాట జగన్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఉపాధ్యాయ దినోత్సవ బహిష్కరణకు ఏపీసీపీఎస్‌ఈఏ పిలుపునివ్వడం, వారికి ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం ప్రకటించడంతో ప్రభుత్వం మరింత అభాసుపాలు కానుంది. ఈనెల 1వ తేదీన చలో విజయవాడకు సన్నద్ధమైన ఉద్యోగులపై కేసులు, నిర్బంధాలు, నోటీసు లతో వేధింపులకు గురిచేయదాన్ని నిరసిస్తూ... ఈనెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ఏపీసీపీఎస్‌ఈఏ ప్రకటించింది. ఉపాధ్యాయులకు ఇచ్చే అవార్డులను సైతం తిరస్కరించాలని పిలుపునివ్వగా, దానికి మిగిలిన ఉపాధ్యాయ సంఘాలు మద్దతివ్వడంతో ప్రభుత్వానికి దిక్కుతోచని స్థితి నెలకొంది. అవార్డుల తిరస్కరణ ద్వారా ప్రభుత్వానికి వినూత్న నిరసనతో సీపీఎస్ ఉద్యోగులు షాక్ ఇవ్వనున్నారు. సీపీఎస్ రద్దు కోసం ఈనెల 1వ తేదీన చలో విజయవాడకు అనుమతి కోరుతూ, పోలీసు అధికారులకు అసోసియేషన్ దరఖాస్తు చేసినా, దానిపై స్పందించలేదు. పైపెచ్చు సీపీఎస్ ఉద్యోగులపై బైండోవర్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు, 41 వంటి రకరకాల కేసులతో వేధింపులకు గురిచేస్తున్నారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక, వాతావరణం సరిగ్గా లేనందున 1వ తేదీ చలో విజయవాడ నిరసనను 11కు వాయిదా వేసుకున్నారు. దీనిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమయ్యాయి.

'చలో విజయవాడ' అంటే సర్కారుకు గుబులు

ఉద్యోగ, ఉపాధ్యాయులు 'చలో విజయవాడ' అంటేనే ప్రభుత్వానికి గతంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు 'చలో విజయవాడ'ను విజయవంతం చేసిన తీరు గుర్తుకొస్తోంది. వాస్తవానికి ఈనెల 1వ తేదీన సీపీఎస్ యూనియన్

- మిగతా 2 లో

సభలో అభివాదం చేస్తున్న రాజా, అతుల్ కుమార్ అంజన్, నారాయణ, పువ్వాడ, అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ తదితరులు

బీజేపీని గద్దెదించాల్సిందే

దేశ ప్రజల ఆశ, భవిష్యత్ ఎర్రజెండానే

- మోదీ పాలనలో పెరుగుతున్న అంతరాలు
- మాటలకే సహకార సమాఖ్య స్ఫూర్తి పరిమితం
- శంషాబాద్ బహిరంగ సభలో డి రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర–శంషాబాద్: దేశం బీజేపీ చేతిలో సురక్షితంగా ఉండబోదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాఖ్యవిధానాన్ని రక్షించుకునేందుకు 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక బీజేపీని అధికారం నుంచి దూరం చేసేందుకు ప్రజాస్వామ్య, లౌకిక పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా చేతులు కలపాలని రాజా పిలుపునిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సవాల్ విసురుతున్నారని, ఇది మంచి పరిణామమని అభినందించారు. బీజేపీపై కేసీఆర్ స్థిరంగా పోరాడాలని, తెలంగాణ ప్రజలందరినీ కూడగట్టాలని సూచించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభ ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఇన్ఫాంట్ జీసెస్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి జెడ్‌పి హైస్కూల్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కామ్రేడ్ సిద్ధి వెంకటేశ్వర్లు మైదానం(జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్)లో బహిరంగ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా డి.రాజా, గౌరవ అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శులు అతుల్ కుమార్ అంజన్, డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా హాజరయ్యారు. వేదికపై రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకట రెడ్డి, కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, టి.శ్రీనివాసరావు, ఎన్. బాలమల్లేశ్, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, ఎం.బాలనర్సింహా, వీఎస్‌బోస్, జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి , సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆశీనులయ్యారు. రాజా ప్రసంగం కొనసాగిస్తూ, బీజేపీ అధికారంలో కొనసాగితే ప్రజాస్వామ్యం చచ్చిపోతుందని, భారతదేశం ఒక దేశంగా ఉండబోదని, దేశం ముందుకు సాగబోదన్నారు. అందుకే బీజేపీని గద్దె దింపేయాలని, కీలకమైన 2024 పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు, ప్రాంతీయ పార్టీలు కలిసి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే దేశంలో శరవేగంగా మార్పు కనిపిస్తోందని, ప్రాంతీయ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమవుతున్నాయని చెప్పారు. తమిళనాడులో సీఎం స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే సైతం బీజేపీకి వ్యతిరకంగా సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చేస్తోందన్నారు. బీహార్‌లో నితీశ్ కుమార్ బీజేపీ కబంధ హస్తాల నుంచి బయటపడి మహాకూటమితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారనీ, తాజాగా తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం బీజేపీపై పోరాటం చేస్తున్నారని చెప్పారు. నిజాం వ్యతిరేక పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్రే లేదన్నారు. వర్గ, కుల రహిత సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమని, దేశ ప్రజల ఆశ, భవిష్యత్తు ఎర్రజెండానే అని రాజా స్పష్టంచేశారు.

తెలంగాణ నేల విప్లవాలతో పునీతమైన గడ్డ అని , కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిజాం రాచరిక విముక్తికి అద్భుతమైన పోరాటం చేసినందని గుర్తు చేశారు. నాటి పోరాటంలో బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఇసుమంతైనా లేదన్నారు. అలాంటిది కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చి సెప్టెంబరు 17 నుంచి ఏడాది పాటు తెలంగాణ విమోచన ఉత్సవాలు జరుపుతామనడం

- మిగతా 2 లో

మధ్యప్రదేశ్‌లో భారీ కుంభకోణం

పిల్లల ఆహార పథకంలో

గోల్‌మాల్

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. స్కూల్ పిల్లల ఆహార పథకంలో నగదు భారీగా చేతులు మారింది. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యవేక్షణలో ఉన్న మహిళా, శిశు అభివృద్ధి శాఖలో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు మధ్యప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ గుర్తించింది. 2018-21 వరకు ఈ శాఖలో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి 36 పేజీల నివేదికను విడుదల చేసింది.

8 లో

రాజ్యాంగ రూపకల్పనలో న్యాయవాదుల పాత్ర కీలకం

సీజేఐ లలిత్

రాజ్యాంగం, స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదుల కృషిని సీజేఐ యూయూ లలిత్ గుర్తు చేసుకున్నారు. గతంలో న్యాయవాదులుగా ఉన్న గొప్ప నాయకులను, రాజ్యాంగ రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని స్మరించుకున్నారు.

2 లో

విద్వేషాన్ని పెంచుతున్నారు

- దేశాన్ని ముక్కలు చేయడమే ప్రధాని విధానం
- ప్రజలు అల్లాడుతుంటే మోదీ మహారాజులా ప్రవర్తిస్తున్నారు
- విద్వేషాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రెచ్చగొడుతున్నాయ్
- రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

న్యూఢిల్లీ : నిత్యావసర వస్తువులు, పెట్రో ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతుంటే ప్రధాని మోదీ మహారాజులా ప్రవర్తిస్తున్నారని, సమస్యలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. మెహంగాయీ పర్ హల్లా బోల్ ర్యాలీలో ఆయన తనదైన శైలిలో కేంద్రప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రజల్లో భయం నింపేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో కోపం, విద్వేషాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రెచ్చగొడుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని ముక్కలు చేయడమే ప్రధాని మోదీ విధానమని దుయ్యబట్టారు. మోదీ పాలనలో అదానీ, అంబానీ మాత్రమే సంతోషంగా ఉన్నారని, వీరి కోసమే సాగు చట్టాలను తీసుకు వచ్చారని ఆరోపించారు. ఈ పారిశ్రామికవేత్తల మెప్పు, ప్రయోజనాల కోసం మోదీ 24గంటలు పనిచేస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. మీడియా, న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ వంటి స్వయంప్రతిపత్తిగల సంస్థలనూ బీజేపీ ప్రభుత్వం ఒత్తిడికి లోనుచేస్తోందని, వాటిని తక్కువగా చూస్తోందని విమర్శించారు. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశాన్ని ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పారు. మోదీ బడా వ్యాపారవేత్తల ప్రయోజనార్థం దేశాన్ని విభజించాలని చూస్తున్నారని, పేదలు, అణగారిన వర్గాలతో పాటు సమాజంలోని అందరికి సమాన ప్రయోజనాలు కల్పించాలన్నది కాంగ్రెస్ సిద్ధాంతమని రాహుల్ గాంధీ నొక్కిచెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌తో దాడులు చేయించినంత మాత్రానా ఎవ్వరూ భయపడబోరని, ఐదేళ్ల పాటు ఈడీ విచారించినప్పటికీ భయపడలేదన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికి ప్రతిపౌరుడు ఉద్యమించాలని రాహుల్ పిలుపునిచ్చారు. ద్రవ్యోల్బణంతో ప్రజలు బాధపడుతున్నారంటూ మోదీ పాలన తీరుపై రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నేడు ప్రజలు తమకు కావాల్సినవి కొనుక్కోవడానికి కూడా ఆలోచించాల్సి వస్తోందని, ఈ సమస్యలకు ప్రధానమంత్రి బాధ్యత వహించాలన్నారు. ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా వినిపించే ఐక్యగళాన్ని రాజు (మోదీ) వినాల్సిందేనని రాహుల్ అన్నారు. పేదలు, రైతులు, కార్మికులతో పాటు అన్ని వర్గాల వారు మోదీ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయారన్నారు. పేదల వెన్నెముకను మోదీ విరిచేశారని, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని

- మిగతా 2 లో

ఒబామాకు 'ఎమ్మీ' అవార్డు..

లాస్ ఏంజిల్స్ : అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా శనివారం ప్రతిష్టాత్మక ఎమ్మీ అవార్డును గెలుచుకున్నారు. నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ 'అవర్ గ్రేట్ నేషనల్ పార్క్స్'కుగాను ఉత్తమ కథకుడు (బెస్ట్ నరేటర్) అవార్డు ఆయనను వరించింది. ఒబామా వద్ద ఇప్పటికే రెండు గ్రామీ అవార్డులు ఉన్నాయి. వినోద రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డుల్లో ఎమ్మీ, గ్రామీతో పాటు ఆస్కార్, టోని పురస్కారాలు ఉన్నాయి. ఇక ఆయన ఈజీఓటీ (ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్, టోని) దిశగా వేగంగా ముందుకు సాగుతున్నారనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా 17 మంది మాత్రమే ఈజీఓటీ జాబితాలో ఉన్నారు. అవర్ గ్రేట్ నేషనల్ పార్క్స్ డాక్యుమెంటరీని హైయర్‌గ్రౌండ్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఇది ఒబామా దంపతుల కంపెనీ. ప్రపంచంలోని నేషనల్ పార్కుల (అభయారణ్యాల)పై ఈ డాక్యుమెంటరీ రూపొందింది. ఎమ్మీ అవార్డును గెలుచుకున్న రెండవ అమెరికా అధ్యక్షుడిగా ఒబామా నిలిచారు. 1956లో డ్వైట్ డి ఇసెన్‌హోవర్‌కు ప్రత్యేక ఎమ్మీ అవార్డు లభించింది. కాగా, 'ది అడాసిటీ ఆఫ్ హోప్', 'ఎ ప్రామిస్డ్ ల్యాండ్' అను ఆడియో బుక్స్‌లో కథనానికిగాను ఒబామాను రెండు గ్రామీ అవార్డులు వరించాయి. ఒబామా భార్య మిచ్చెలీ 2020లో గ్రామీ అవార్డును అందుకున్నారు.

జగన్ సర్కార్‌కు షాక్!

(మొదటిపేజీ తరువాయి)

నేతలు చలో సీఎం, చలో విజయవాడ(మిలియన్ మార్చ్)కు పిలుపునిచ్చి, అనివార్య కారణాల వల్ల వాటిని 11వ తేదీకి వాయిదా వేశారు. 1వ తేదీన సీపీఎస్ ప్రవేశపెట్టిన రోజును విద్రోహ దినంగా ప్రకటించి నిరసనలకే పరిమితమయ్యారు. 11వ తేదీ ఆదివారం కావడంతో పెద్దఎత్తున సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులను చలో విజయవాడకు తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పోలీసుల నిర్బంధకాండను సైతం ఎదుర్కొంటూ, ఈ విడత తాడోపేడో తేల్చుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఆందోళనకు వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతిచ్చాయి. దీంతో సీపీఎస్ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతు వెల్లువెత్తుతోంది. ఈనెల 1వ తేదీన తలపెట్టిన ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు పోలీసు యంత్రాంగంతో ప్రభుత్వం సకల యత్నాలు చేసింది. సీపీఎస్ఈయూ నేతలు, ఆ పరిధిలోని ఉద్యోగులపై బైండోవర్ కేసులు, నిర్బంధాలు, నోటీసులతో హెచ్చరికలు జారీజేసింది. ఆయా జిల్లాల నుంచి విజయవాడకు తరలిరాకుండా, వారి వాహనాలను సమీప పోలీస్‌స్టేషన్లకు రప్పించుకుని అక్కడే ఉంచారు. రైళ్లు, బస్సు మార్గాలపై నిఘా పెట్టారు. ఆ రోజు ఉద్యమానికి వచ్చే వారికి అల్పాహారం, భోజన సౌకర్యాలు అందుబాటులో లేకుండా వివిధ హోటళ్ల యాజమాన్యానికి పోలీసులు పరోక్షంగా హుకుం జారీజేశారు. వారం రోజుల ముందు నుంచే సీపీఎస్ యూనియన్ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నిరసన వాయిదా పడినప్పటికీ, వారిని పోలీస్‌స్టేషన్లలోనే ఉంచారు. ఆయా చర్యల్ని ఖండిస్తూ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం బృందం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతులు అందజేసింది. అయినా పోలీసుల వైఖరిలో మార్పులేదు. మళ్లీ చలో విజయవాడకు సీపీఎస్ఈయూ నేతలు సిద్ధమవుతున్న తరుణంలో విజయవాడ పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలీసు బలగాల మోహరింపునకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. నిఘా వర్గాల ద్వారా మద్దతిచ్చే ఉద్యోగ సంఘాల నేతలపైన దృష్టి సారించింది. వారికి ముందస్తుగా నోటీసులు జారీజేస్తూ, కేసులు, నిర్బంధాలకు శ్రీకారం చుట్టడాన్ని సీపీఎస్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ జిల్లాల్లో పోలీసుస్టేషన్ల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు.

ఉపాధ్యాయులంతా బహిష్కరించాలి: ఏపీసీపీఎస్ఈఏ

శాంతియుతంగా తాము ఈనెల 1వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ(మరో మిలియన్ మార్చ్)కు ప్రభుత్వం అనుమతివ్వకుండా ఉపాధ్యాయులపై కేసుల నమోదు, నిర్బంధించడాన్ని నిరసిస్తూ... ఈనెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరించాలని ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆర్.అప్పలరాజు, కె.పార్థసారథి పిలుపునిచ్చారు. తమకు అనుమతులు రానందున, 29వ తేదీన చలో విజయవాడను వాయిదా వేసినట్లు ప్రకటించామని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం కక్ష పూరితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులపై అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. దానికి మద్దతిచ్చిన ఉపాధ్యాయ సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు.

విద్వేషాన్ని పెంచుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

అవహేళన చేశారని రాహుల్ అన్నారు. దేశంలో పేదరికం మరింత పెరగబోతోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షాలపైకి ఈడీ, సీబీఐని పంపుతున్నారన్నారు. ప్రజలకు భరోసా కల్పించే కార్యక్రమాలు కరువయ్యాయని, ముఖ్యంగా రైతులు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ దేశాన్ని తిరోగమనంలోకి నెట్టివేస్తున్నారన్నారు. ఎనిమిదేళ్లలో 23 కోట్ల మందిని పేదరికంలోకి నెట్టివేశారని, పదేళ్ల తమ శ్రమను కేవలం ఎనిమిదేళ్లలో నాశనం చేశారని రాహుల్ అన్నారు. భారతీయ ఆర్థిక శక్తిని మోదీ అంతం చేస్తున్నారని, నిరుద్యోగం 40ఏళ్ల గరిష్టానికి చేరుకుందన్నారు. అధిక ధరలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, విద్వేషం వల్ల దేశం బలోపేతం కాగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ దేశ ఐక్యతకు కృషి చేస్తూ విద్వేషాన్ని, భయాన్ని రూపుమాపే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కేవలం కాంగ్రెస్ విధానాలు, సిద్ధాంతాలతోనే దేశం పురోగతి సాధించగలదని నొక్కిచెప్పారు. ఇవ్వాలనుకున్నాగానీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితుల్లో దేశం ఉందని వ్యాఖ్యానించారు. తనను ఈడీ కార్యాలయంలో 55 గంటలు కూర్చోబెట్టారని... 500 గంటలు కూర్చోబెట్టినా భయపెట్టలేరని మోదీకి తేల్చిచెప్పారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ మరింత ఉధృతంగా పోరాడతుంటుందని పార్టీ మాజీ అధ్యక్షుడు ఉద్ఘాటించారు. అనంతరం మల్లికార్జున ఖర్గే, అశోక్ గెహ్లాట్ తదితర నాయకులు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలను గద్దె దింపాలి

ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని



విశాలాంధ్ర-బాపట్ల: కార్మికచట్టాలను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ... పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను నేటి ప్రభుత్వాలు రద్దు చేస్తూ... కార్మికులను రోడ్డున పడేవిధంగా చేశాయన్నారు. కార్మిక హక్కులను హరిస్తూ కుటుంబాలు పస్తులు ఉండేలా ప్రభుత్వాలు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి, దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతున్నారన్నారు. యువతను ఆర్ఎస్ఎస్ భావజాలంలో లాగి దేశంలో మతకల్లోలాలు సృష్టించటమే పనిగా మోదీ ప్రభుత్వం పాలన చేస్తోందన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెంది ప్రభుత్వాలకు కొమ్ముకాయటం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తల ఉద్యోగాలు నేటికి భర్తీ చేయకపోటం అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. హక్కులను కాలరాస్తూ ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్న ప్రభుత్వాలను గద్దె దింపాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. బీజేపీకి మద్దత్తు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నాగాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, జిల్లా కార్యదర్శి బత్తులు శ్యామేల్, ఉపాధ్యక్షులు కేఎల్‌వి ప్రసాద్, ఏరియా కార్యదర్శి జేబీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకమైన మిత్రదేశం భారత్

- చేసిన సాయం ఎప్పటికీ మరువలేను
- నాకు, నా భర్తకు ఆశ్రయమిచ్చింది
- 1975 నాటి ఘటనను గుర్తుచేసుకున్న బంగ్లాదేశ్ ప్రధాని
- నేడు భారత్‌కు షేక్ హసీనా

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా సోమవారం నుంచి నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటిస్తారు. మూడేళ్ల తర్వాత ఆమె భారత్‌కు వస్తున్నారు. ఆమె వెంట మంత్రులు, కార్యదర్శులు, వ్యాపార దిగ్గజాలు రానున్నారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాను హసీనా సందర్శించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో పాటు ప్రధాని మోదీతో భేటీ అవుతారు. ఈ పర్యటనలో భాగంగా ఖుషియారా నదిలో నీటి ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నట్లు తెలిసింది. ఈ పర్యటన ఇరుదేశాల వివిధ రంగాల అభివృద్ధితో పాటు ఆర్థిక, వ్యూహాత్మక పురోగతికి దోహదమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. భారత్ పర్యటన క్రమంలో షేక్ హసీనా ఓ ప్రముఖ వార్తాసంస్థతో మాట్లాడారు. సైనిక తిరుగుబాటు రోజులను గుర్తుచేసుకున్నారు. తన కుటుంబాన్ని కోల్పోయినప్పుడు భారత్ తనకు ఆశ్రయం ఇచ్చిందని, ఆ సాయాన్ని మరువలేనని ఆమె చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధమప్పుడు ఆ దేశంలో చిక్కుకుపోయిన బంగ్లాదేశీ విద్యార్థులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చినందు భారత్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్ సమయంలోనూ అందించిన టీకా సాయాన్ని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య అనేక సమస్యలను చర్చించి పరిష్కరించుకున్నట్లు చెప్పారు. భారత్ తమకు నమ్మకమైన మిత్రదేశమని హసీనా అభివర్ణించారు. 1971లో తమకు అండగా నిలిచిందని, అప్పటి యుద్ధంలో భారత్ పోషించిన పాత్రను మరువలేమని అన్నారు. 1975లో తాను కుటుంబ సభ్యులందరినీ కోల్పోగా అప్పటి భారతీయ ప్రధాని తనను తమ దేశానికి పిలిపించి అక్కడ ఆశ్రయం కల్పించారని చెప్పారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని హసీనా చెప్పారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో పర్యటించడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. 1971 యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన 200 మంది భారతీయ అమర జవాన్ల కుటుంబాలకు ముజిబ్ స్కాలర్‌షిప్‌లను ఆమె అందిస్తారు. కాగా, వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఏడు ప్రతిపక్ష పార్టీలు ఒక కూటమిగా ఏర్పడి షేక్ హసీనాకు సవాల్ విసురుతున్నాయి. ప్రతిపక్ష రాజకీయ కూటమిని, దేశం ముందున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకొని ముందుకు వెళ్లడానికి ఆమెకు భారత్ సాయం ఎంతో అవసరం.

పాక్‌లో 1300కు పెరిగిన వరద మృతులు

మమ్మల్ని ఆదుకోండి : అంతర్జాతీయ సాయానికి వినతి

ఇస్లామాబాద్ : భారీ వర్షాలు, వరదలతో పాకిస్తాన్ అల్లకల్లోలం కాగా ఇప్పటివరకు 1300 మంది మృతి చెందినట్లు ఆ దేశ విపత్తుల నిర్వహణ విభాగం వెల్లడించింది. 24 గంటల్లో 24 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు పాకిస్తాన్ ప్రభుత్వం తెలిపింది. స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. దక్షిణ పాక్‌లో వర్షాలు, వరదల తీవ్రత ఎక్కువగా ఉండటంతో బలూచిస్థాన్, ఖైబర్ పాక్తున్వాకా, సింధ్ ప్రాంతాల్లో మృతుల సంఖ్య భారీగా ఉంది. భారీ వరదల దాటికి 1,468,019 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 10 బిలియన్ల నష్టం వాటిల్లింది. కొన్ని అంతర్జాతీయ సంస్థలతో కలిసి అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారు. బలూచిస్థాన్, సింధ్, పంజాబ్ ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసిన శిబిరాల్లో 5,00,000 మందికిపైగా ఆశ్రయం పొందుతున్నట్లు చెప్పారు. అన్ని విధాలుగా నష్టపోయిన తమను ఆదుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని పాకిస్తాన్ అభ్యర్థిస్తోంది. తమ దేశానికి అండగా నిలవాలని, తక్షణ సాయం అందించాలని కోరుతోంది. 30ఏళ్లలో లేనంత వర్షపాతాన్ని పాకిస్తాన్ చవిచూసిందని ఓ మంత్రి వెల్లడించారు. 2005లో అమెరికాలో కత్రీనా తుపాను వల్ల సంభవించినంత నష్టం ప్రస్తుతం పాకిస్తాన్‌లో జరిగిందని, నాడు 1200 మంది చనిపోగా 33 మిలియన్ల మంది నిరాశ్రయులు అయినట్లు అధికారులు వెల్లడించారు. వరదల వల్ల జరిగిన పంట నష్టాన్ని రైతులు ఇంకా అంచనా వేసుకుంటున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు ఆంటోనియో గుటెర్రస్ ఈనెల 9న పాకిస్తాన్‌ను సందర్శించనున్నారు. 160 మిలియన్ డాలర్ల అత్యవసర సహాయానికిగాను పాకిస్తాన్, ఐరాస కలిసి విజ్ఞప్తి చేసిన క్రమంలో ఆయన సంఘీభావం తెలిపేందుకు పాక్‌లో పర్యటిస్తారు. వరద పీడిత ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తారు.

ఏ కొండూరు... మరో ఉద్దానం!

విశాలాంధ్ర-డిజిటల్: ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఏ కొండూరు మండలం మరో ఉద్దానాన్ని తలపిస్తోంది. గత ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతోంది. ఇప్పటి వరకూ శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీవ్యాధిగ్రస్తుల ఖిల్లాగా పేరొందింది. ఇప్పుడు దాని సరసన ఏ కొండూరు చేరింది. మండలంలోని 15 గ్రామాల్లో కిడ్నీ సమస్యలు అధికమవడంతో ప్రతిరోజూ మరణవేదన వినిపిస్తూనే ఉంది. అంతుచిక్కని మూత్రపిండాల వ్యాధినబారిన పడిన బాధితుల ఇల్లు, ఒళ్లు గుల్లవుతున్నాయి. కొందరు ఆస్తులు అమ్ముకుంటుండగా, మరికొందరు సరైన వైద్య చికిత్సకు చేతిలో చిల్లిగవ్వ లేక మృత్యువును ఆహ్వానించాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. ఒక్క దీప్లానగర్ తండాలోనే సుమారు 150 కుటుంబాలు నివశిస్తుండగా 90 కుటుంబాల్లో ఇంటికి ఒకరు చొప్పున వ్యాధిబారిన పడినట్లు తండా పెద్ద చెబుతున్నారు. ఐదేళ్లలో 250 మందికిపైగా మృతిచెందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నా అనధికారికంగా మండలంలో 500కి పైగా మృత్యువాత పడినట్లు స్థానికులు వెల్లడించారు. అధికశాతం 40-50 ఏళ్ల లోపు వారే మృతి చెందుతున్నట్లు చెప్పారు. 22 తండాల్లో నీరు విషతుల్యం కావడంతోనే వ్యాధినబారిన పడి మంచానపడుతున్నారని చెబుతున్నారు. నీటి కాలుష్యం మూలాలు కనుగొని నివారించాల్సిన అధికారులు మొద్దు నిద్రలో జోగుతున్నారని ఆరోపిస్తున్నారు. మరణాలు అదుపు చేయాల్సిన ప్రభుత్వం... వ్యాధిగ్రస్తులకు పింఛన్ ఇచ్చి చేతులు దులుపుకుంటోందని కంటనీరు పెట్టుకున్నారు. దయాలసిస్ పేషెంట్‌కు పింఛన్ మంజూరు చేయండని నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగి అధికారులకు మొరపెట్టుకుంటే చివరికి మృతి చెందిన తరువాత పింఛన్ మంజూరైందని చెప్పడం కుటుంబాలను కలచివేస్తోంది. అధికారులు తప్పుడు నివేదికలిస్తూ ప్రభుత్వాన్ని సైతం బురిడీ కొట్టిస్తున్నారని మండిపడ్డారు. చెడు అలవాట్ల వల్లే వ్యాధిబారిన పడుతున్నారని చెబుతున్నారనీ, ఎలాంటి చెడ్డ అలవాట్లు లేని మహిళలు, పిల్లలు సైతం భూతం బారిన ఎందుకు పడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. కిడ్నీ బాధితులు కేవలం ఏ కొండూరు మండలానికే పరిమితం కాలేదని, జిల్లాలో జీ కొండూరు, తిరువూరు, గంపలగూడెం, మైలవరం, నూజివీడు, జగ్గయ్యపేట మండలాల ప్రజలను కిడ్నీ మహమ్మారి కబళిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ హాయిగా జీవించే ప్రజలు అయినవారిని కోల్పోయి పెదదిక్కులేక బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

నూజివీడు, తిరువూరు, జగ్గయ్యపేట, బెజవాడలో దయాలసిస్ కేంద్రాలు ఉన్నా వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని అనీ, నడవలేని వ్యాధిగ్రస్తుడిని కారులో తీసుకెళ్లి దయాలసిస్ చేయించే స్తోమత తమకు లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధి తీవ్రతను బట్టి నెలకు రూ.8 వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుందనీ, రక్త శుద్ధి కోసం పైప్ వేయించాలంటే రూ.50 వేల నుంచి లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కూలి పని చేసుకుబతికే తమకు ఏళ్ల తరబడి వైద్యం కోసం ఖర్చు చేయలేక చావుకు ఎదురు చూడడం తప్ప మరో మార్గం లేదని బాధితుడు చెప్పిన మాటలు విన్నవారెవరికైనా కళ్లు చెమర్చాల్సిందే. ఏళ్లతరబడి ఏ కొండూరులో దయాలసిస్, రీసెర్చ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా కనికరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చివరిప్రయత్నంగా వారం రోజుల క్రితం గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపిరాజు అధ్వర్యంలో కలెక్టరు ఢిల్లీబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్టు బాధితుల కమిటీ సభ్యుడొకరు చెప్పారు. ఆయన సానుకూలంగానే స్పందించారనీ కలెక్టర్ రాకకోసం ఎదురుచూస్తున్నామనీ... ప్రభుత్వం స్పందించకుంటే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేస్తామని వెల్లడించారు. 2017లో ఆయుష్ మాజీ డైరెక్టర్ రవీంద్ర సీకేడీ (క్రానిక్ కిడ్నీ డిసీజ్)పై నివేదిక ఇచ్చినా ప్రభుత్వాలు నేటి వరకు బయటపెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దీప్లానగర్ తండా, పెదతండా, గీతానగర్ తండా, కేశగామ్య, మాన్‌సింగ్ తండా, చైతన్య నగర్ తండా, చీమలపాడు, రేపూడితండా, కంభంపాడు తండా, లక్ష్మీపురం తదితర తండాల ప్రజలు ఫ్లోరైడ్, సిలికాన్ శాతం అధికంగా ఉన్న నీటిని తాగడం వల్లే కిడ్నీ బారిన పడుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. నీటిలో 0.6 మిల్లీగ్రాములకు బదులు 2.4 మిల్లీగ్రాములు ఫ్లోరైడ్ శాతం ఉందని అధికారులు గుర్తించారనీ, అధికశాతం కలిగిన ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నందుకే వ్యాధిబారిన పడుతున్నారని అన్నారు. ఎక్కువగా 40 ఏళ్ల లోపువారే మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నారని, దీంతో కిడ్నీలు దెబ్బతింటున్నాయని వివరించారు. కాళ్లు వాయడం, నడవలేకపోవడం, నొప్పులు అధికమవడంతో ఉపశమనం కోసం స్థానిక మందుల షాపుల్లో దొరికే పెయిన్ కిల్లర్స్ వేసుకొని అశ్రద్ధ చేస్తున్నారనీ, వ్యాధి వైద్యానికికందని స్థితిలో నెఫ్రాలజిస్టుల దగ్గరకు వెళుతున్నారని చెప్పారు. జీవితాంతం దయాలసిస్ చేయించుకుంటున్నా సాధారణ జీవనస్థితికి చేరుకోవడం కష్టమన్నారు. ధూమపానం, మద్యంతో పాటు ఫ్లోరైడ్ నీరు తాగడం, వంటకాలకు ఉపయోగించడంతో వయస్సు, లింగభేదం లేకుండా అధికశాతం కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నట్టు తెలిపారు.

ఆదుకుంటానన్నారు... ముఖంచాటేశారు

నా భర్త రాంబాబు 45 ఏళ్లకే కిడ్నీ వ్యాధితో చనిపోయాడు. పింఛన్ ఇవ్వండని నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగి అధికారులను వేడుకున్నా... మృతిచెందిన తరువాత మంజూరు చేశారు. రెండెకరాల భూమి అమ్మేసి వైద్యం చేపించా... అయినా బతకలేదు. ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తానంది... నా పిల్లాడిని చదివిస్తానంది... 2 ఎకరాల భూమీ ఇస్తానని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది... ఆనక ముఖం చాటేసింది. భర్తను కోల్పోయిన నేను ఎలా బతకాలో అర్థంకావడం లేదు. నా భర్తలా ఎవరూ చనిపోకూడదు... నాకొచ్చిన కష్టం మరెవరికీ రాకూదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం కళ్లు తెరవాలి. చావు కేకలు వినిపించకుండా చర్యలు తీసుకోవాలి.

- జరబాల లలిత, పెదతండా

రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నేను వైఎస్సార్‌సీపీ కార్యకర్తను. పార్టీ గెలుపునకు అందరం కృషి చేశాం. అధికారంలోకి వస్తే కిడ్నీవ్యాధి నిర్మూలిస్తారని ఆశించాం. మా మండలంలో దయాలసిస్ సెంటర్, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకున్నాం. ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. విసిగివేసారి వారం రోజుల క్రితమే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం. సానుకూలంగానే స్పందించారు. రీసెర్చ్ రిపోర్ట్ తనవద్దే ఉందని చెప్పారు. ఆయన రాకకోసం ఎదురు చూస్తున్నాం.

- నాగరాజు, ఏ కొండూరు

పరిధి దాటే అధికారం లేదు

నా వద్దకు అనేకమంది రోగులు వస్తూ ఉంటారు. కాళ్లు వాసి నొప్పులతో బాధపడుతున్నామని చెబుతారు. మందులిచ్చి పంపుతుంటాం. కిడ్నీ వ్యాధి అన్న అనుమానమొస్తే సీరమ్ క్రియాటిన్ టెస్ట్ కోసం పంపిస్తాం. నిర్ధారణ చేయాల్సింది సెర్ప్ డిపార్ట్‌మెంట్. రోగికి దయాలసిస్ అవసరం అని నెఫ్రాలజిస్ట్ నిర్ణయిస్తారు. స్టేజి దాటితేనే పింఛన్ కోసం రాస్తారు. ఎవరైనా చనిపోతే వారి మెడికల్ రిపోర్టు ఆధారంగా ఎంఆర్‌వోకు రాస్తాం. వారు మట్టి ఖర్చులు అందజేస్తారు. పరిధి దాటే అధికారం నాకు లేదు.

- డాక్టర్ రామవరపు దివిజ, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఏ కొండూరు

బీజేపీని గద్దెదించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

విద్దూరంగా ఉన్నదన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ తెలంగాణ ప్రజల వీరోచితమైన పోరాటాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. ఆర్ఎస్ఎస్, సీపీఐ రెండూ 1925లోనే ఏర్పాటయ్యాయని, కాని అటు భారత స్వాతంత్రోద్యమంలోనూ, ఇటు తెలంగాణ విమోచన పోరాటంలోనూ ఆర్ఎస్ఎస్ భాగస్వామ్యం కాలేదన్నారు. ఆ రెండు పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచి, ఎర్రజెండా త్యాగపూరిత పాత్ర పోషించిందన్నారు.

మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ చరిత్రలో అత్యంత వినాశనకరమైనదిగా నిలిచిపోనుందని రాజా అన్నారు. అసలు పరిపాలనే లేదని, కేంద్ర ప్రభుత్వ తప్పుడు పాలనా విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ద్రవ్యోల్బణం మండిపోతోందని, రూపాయి పతనమైపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని , అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయని, ఒకవైపు అదానీ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద సంపన్నుడిగా ఎదిగిపోయారని, మరోవైపు ప్రజలు ఆకలి పోరాటం చేస్తున్నారని, ఆహార భద్రత లేకుండా పోయిందని, ఉద్యోగ భద్రత కరువైందని, పంటలకు కనీస మద్దతు ధర లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అమ్మేస్తున్నదని, రైల్వేలను ప్రైవేటు పరం చేసున్నదని, దేశ ప్రజల రక్త స్వేదాలతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, బడా ప్రైవేటు సంస్థలకు కారు చౌకగా విక్రయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ పాలనలో రాజ్యాంగాన్ని సైతం కాలరాస్తున్నారని రాజా అన్నారు. భారతదేశం లౌకిక దేశమని, ఇది ఎన్నటికీ మతరాజ్యం కాబోదని అంబేద్కర్ సహా రాజ్యాంగ నిర్మాతలందరూ స్పష్టంగా నిర్దేశించారని గుర్తు చేశారు. రాజ్యాంగం స్థానంలో ప్రతీఘాతకమైన మనుస్మృతిని తీసుకువచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఇటీవల వారణాసిలో జరిగిన ధర్మసంసద్'లో ప్రస్తుత రాజ్యాంగాన్ని తొలగించి మనుస్మృతిని అమలు చేయాలని, వారణాసిని దేశ రాజధాని చేయాలని డిమాండ్ చేశారని, దీనిపై ప్రధాని మోదీ, బీజేపీ నేతలు ఒక్క మాట కూడా మాట్లాడడం లేదన్నారు. భారతదేశం సంక్షేమ రాజ్యమని రాజ్యాంగం స్పష్టంగా చెప్పిందని, కాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, బడా కంపెనీలకు ఊడిగం చేస్తూ, దేశ సంపదను వారికి లూటీ చేసి పెడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సామాజిక న్యాయం కొరవడుతోందన్నారు.

ప్రధాని తరచూ సహకార సమాఖ్యవిధానం గురించి మాట్లాడుతారని, కాని ఆచరణలో దానికి తూట్లు పొడుస్తున్నారని రాజా విమర్శించారు. ఈ ప్రభుత్వంలో రాష్ట్రాలకు సహకారం లేదని, చేతలలో సమాఖ్య స్ఫూర్తి ఉండడం లేదన్నారు. భారత దేశాన్ని మోదీ తన సొంత ఆస్తిగా భావిస్తూ, తమకు అనుకూలంగా లేని రాష్ట్ర ప్రభుత్వాలను అణిచివేస్తున్నారని అన్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం మీద బీజేపీ దృష్టి పడిందని, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని ఒక సవాలుగా స్వీకరించి బీజేపీకి వ్యతిరేకంగా ఉధృత పోరాటం చేయాలని రాజా పిలుపునిచ్చారు.

అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న కేంద్రం: అంజన్

అతుల్‌కుమార్ అంజన్ మాట్లాడుతూ, నిత్యం ధరల పెంపుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి పైన కబడ్డీ ఆడుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు, అదాని, అంబానీలకు ప్రజల నుంచి పన్నుల రూపంలో లూటీ చేసిన మొత్తాన్ని కేంద్రం దోచి పెడుతోందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. జీఎస్టీ, పెట్రోల్, డీజిల్ ధరలు, ఎక్సైజ్, కస్టమ్స్ సుంకం, విదేశీ అప్పులపైనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే మోదీ స్వప్నాన్ని నెరవేరనీయవద్దని , అలాగే 2024 ఎన్నికల్లోనూ కేంద్రం లోని ఎన్డీయే ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. సభకు సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న కళారూపాలు

ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా నేతృత్వంలో కళాకారులు తమ ఆట పాటలతో ఆకట్టుకోగా, మహిళా కోలా ట బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ సంగీత దర్శకులు వందేమాతం శ్రీనివాస్ ఎర్ర జెండ.. ఎర్రజెండ ఎన్నియ్యలో..' పాటతో సభికులను ఉర్రూతలూగించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున సీపీఐ కార్యకర్తలు, అభిమానలు బహిరంగ సభకు తరలివచ్చారు. కరోనా అనంతరం సుదీర్ఘ కాలం తరువాత వివిధ జిల్లాల నుంచి వచ్చి శ్రేణులు ఒక చోట కలుసుకోవడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకోవడం కనిపించింది.

రాజ్యాంగ రూపకల్పనలో న్యాయవాదుల పాత్ర కీలకం : సీజేఐ లలిత్

నాగ్‌పూర్ : రాజ్యాంగం, స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదుల కృషిని సీజేఐ యూయూ లలిత్ గుర్తు చేసుకున్నారు. గతంలో న్యాయవాదులుగా ఉన్న గొప్ప నాయకులను, రాజ్యాంగ రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని స్మరించుకున్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ న్యాయవాదుల శాతం తగ్గుతోందన్నారు. ఆదివారం పార్లమెంటులో న్యాయవాదుల శాతం తగ్గుతోందని, దేశ రాజ్యాంగంతో సంబంధం ఉన్న వ్యవస్థాపక పితామహులలో ఎక్కువ మంది న్యాయవాద వృత్తికి చెందిన వారేనని అన్నారు. నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మన దేశం దాని స్వాతంత్ర్య పోరాటం నుంచి న్యాయపరమైన ప్రతిభను చూసింది, ప్రయోజనం పొందిందని అన్నారు. సాధారణంగా ఒక న్యాయవాది సామాజిక సమస్యలు లేదా రాజ్యాంగపరమైన సమస్యలకు ఎలా పరిష్కారాలను కనుగొనాలనే దానిపై సరైన ఆలోచనా విధానాన్ని బహిర్గతం చేస్తారన్నారు. న్యాయవ్యవస్థ నిర్మాణ పిరమిడ్ తప్పనిసరిగా అట్టడుగు స్థాయిలో ఉండాలని, ఇది దేశంలో ప్రస్తుతానికి అత్యంత భారీగా ఉందని ఆయన అన్నారు. న్యాయవ్యవస్థ సరైన దిశలో పయనిస్తున్నదా లేదా అనే ప్రశ్నకు న్యాయవాద విద్యార్థులకు సీజేఐ లలిత్ స్పందించారు. మనది చట్టబద్ధమైన పాలనలో ఉన్న దేశం. ఏది సరైనదో అది ప్రబలంగా ఉంటుంది అని చెప్పారు. ఏదైనా విషయం కోర్టుకు వచ్చినప్పుడు ఎవరికి అన్యాయం జరగదని అన్నారు.

బీజేపీని గద్దెదించుదాం : అఖిలేశ్ యాదవ్

లక్నో : వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారానికి దూరం చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టడం ద్వారా తమ విజయం నిశ్చయమన్నది బీజేపీ భావనగా చెప్పారు. అధికార బీజేపీకి సున్నితత్వం లేదని అన్నారు. బీజేపీ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని తద్వారా 2024లో దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించవచ్చు అన్న నమ్మకం వచ్చిందన్నారు. ఆయన ఆదివారం కార్మిక సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు, టీచర్లు, చిన్న మధ్యస్థాయి వ్యాపారాల ప్రతినిధులనుద్దేశించి పార్టీ రాష్ట్ర కేంద్రకార్యాలయంలో మాట్లాడారు. తమ పార్టీ బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. సోషలిజం, ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోకుండా అభివృద్ధి సాధ్యం కాదని యాదవ్ అన్నట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. కార్మికులు, అణగారిన వర్గాలు కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అధిక ధరలు, ద్రవ్యోల్బణంతో వారి వెతలు వర్ణనాతీతమయ్యాయి.

ఆగకూడదీ పయనం

అలవి మాలినది పయనం
అలసిపోనిదీ గమనం
గమ్యం గుమ్మం తొక్కేదాకా
ఆశలమెట్లను ఎక్కేదాకా
కోరుకున్నది దక్కేదాకా
ఆగక సాగేదీ పయనం

తుదికంటా సాగేదీ గమనం
వద్దని కద్దని వారిస్తున్నా
ఆరోగ్యం సరిలేకుందన్నా
వయసు మళ్ళింది చాలంటున్నా
వెచ్చని కాంతులు కనిపిస్తే సరి
పడుతూ లేస్తూ నడకే ఊపిరి
గుండెదిటవుతో నడవడమే సరి

మతనాగు బుసలణిచే పనిలో
ఊతకర్రలను దారికి తెస్తూ
మసక వెల్తురులో ఇదిగో దారని
పదండి పోదామనడం మన పని
ఫలితం చేతికి అందడమే గురి
ఆగక ముందుకు సాగడమే సరి
అలవిమాలినది పయనం
అలసిపోనిదీ గమనం

-ఏటుకూరి ప్రసాద్

సాహితి

ప్రేమలోక స్వాప్నికుడు కొలకలూరి

రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

పైసాలేనివాడు పైగా హరిజనుడు/ ప్రధానమంత్రి కాగలిగి- ఐదేళ్లు ఉండి/ ఆపైన వదిలి పైసా లేకుండా/ పాత మనిషిగా బతగ్గలిగినాడు/ భారతదేశం బాగుపడ్డట్టు (కొలకలూరి షరా మామూలే. పు:104).

"షరా మామూలే" ఆచార్య కొలకలూరి ఇనాక్ కావ్యం. ఇది 1979 లో వచ్చింది. ఇందులో 1964-79 మధ్య ఒకటిన్నర దశాబ్దంలో వచ్చిన కవితలున్నాయి. ఈ ఒకటిన్నర దశాబ్దాల సామాజిక వాస్తవికత ఈ కావ్యంలో వస్తువు. ఈ కాలానికి అభ్యుదయ రచయితల సంఘం పునరుజ్జీవనం పొందింది. దిగంబర, పైగంబర, చేతనావర్త, తిరగబడు వంటి కవుల బృందాల కవితలు వచ్చాయి. విప్లవ చరయితల సంఘం ఆవిర్భవించింది. విప్లవ సాహిత్యం ఉధృతంగా వస్తున్నది. భారతదేశం పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. బంగ్లాదేశ్ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించింది. ఎమర్జెన్సీ చీకటి రోజులు వచ్చి వెళ్లాయి. జాతీయ స్థాయిలో తొలి కాంగ్రేసేతర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రయోగం విఫలమై మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. హిందీ వ్యతిరేక ఉద్యమం ఎగిసిపడింది. ప్రత్యేక, సమైక్య రాష్ట్రోద్యమాలు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. కృష్ణాజిల్లా దివిసీమను తుపాను స్మశానంగా మార్చివేసింది. భారత స్వాతంత్ర్య రజతోత్సవాలు జరిగాయి. పశ్చిమబెంగాల్‌లో ప్రాణం పోసుకున్న నక్సల్బరీ ఉద్యమం శ్రీకాకుళాన్ని తాకింది. అక్కడ అణచివేతకు గురై, ఉత్తర తెలంగాణకు పాకింది. స్వాతంత్ర్యానంతర భారతీయ పాలనా వ్యవస్థ మీద అన్ని మూలల నుంచీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి రెండున్నర దశాబ్దాలు గడచిపోయినా సామాజిక ఆర్థిక రాజకీయరంగాలలో రావసినంత మార్పు రాలేదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి వంటి సమస్యలు సామాన్యుల జీవితాలను దుర్భరంగా మారుస్తున్నాయి. జనతా ప్రయోగం విఫలమై 'షరా మామూలే' అన్నట్లయింది. ఈ పరిణామాలే విమర్శనాత్మక వాస్తవికతగా ఈ కావ్యం వచ్చింది. ఆచార్య కొలకలూరి ప్రౌఢనిర్భరవయఃపరిపాక దశలో రాసిన కావ్యం "షరా మూమూలే"

కాలం నడుస్తున్న కొలదీ, సామాన్యుల జీవితంలో మార్పు రాకపోవడం "షరా మామూలే". కవి సామాన్య మానవ సమూహం పక్షం వహించి రాసిన కావ్యం "షరా మూమూలే". సామాన్యులనూ నిరంతరం పట్టి పీడించేది ధరల పెరుగుదల. సామాన్యుల జీవితావసరాలకు, వాళ్ల ఆర్థిక వనరులకూ, వాళ్లకు కావలసిన వస్తువుల ధరలకూ మధ్య అంతరం ఎక్కువ కావడం "షరా మామూలే". ఈ సమస్యతో సతమతమవుతున్నా పేదల జీవన సమరాన్ని కొలకలూరి "మన దేశమా?", 'ఏమయ్యేట్టు', 'ఆట', 'నేను', 'మహాత్ముడు' వంటి అనే కవితలలో అధిక్షేపాత్మకంగా ఆవిష్కరించారు. అధిక ధరలతో సామాన్యులే గాక మధ్యతరగతి వాళ్లు కూడా ఎలా బాధలు పడుతున్నారో 'మన దేశమా?' కవితలో చిత్రీకరించారు. ఎవరినీ సుఖపెట్టని రాజకీయ వ్యవస్థ మీద వ్యంగ్య బాణం ఈ కవిత. అందరి జీవితాలను చెప్పి, లోకమంతా ప్రేమై/ హృదయమంతా దయై/ ఉంటే తప్పు/ ఈ జీవితాలకు మోక్షం లేదా (పు:4) అని తీర్మానించారు కవి. ఆర్థిక దుస్థితి, దాని దుష్పరిణామాలు ఎలా ఉంటాయో కవి 'దేశం ఏమయ్యేట్టు' కవితలో హెచ్చరించారు.

నాకు తెలుసు/ మీకు లోకమంటే సౌజన్యం/ దేశమంటే సౌభాగ్యం/ కానీ మీకు తెలుసు/ నాకు లోకమంటే ఆకలి/ దేశమంటే కేక (పు:5)

పేదరికంతో భారతదేశంలోంచి చిన్నపిల్లల జీవితం స్వాతంత్ర్యానంతరం ఎంత విషాదంతో ఈ కవిత వర్ణించింది. అందువల్ల 'దేశమంటే సౌభాగ్యం' అన్న ఊహ నిజం కావాలనీ 'లోకమంటే ఆకలి' అనే నిజం అబద్ధం కావాలని కోరుకున్నాడు. ఆకలిలేని భారతం కొలకలూరి సామాజిక దృక్పథం.

'ఏమయ్యేట్టు?' 'భయం' వంటి కవితలను కొలకలూరి అంతర్జాతీయ బాలల సంవత్సరం సందర్భంగా రాశారు. అంతర్జాతీయంగా బాలల కోసం ఒకరోజునూ కేటాయించమంటే, వాళ్ల స్థితి బాగా లేదనే అర్థం. అందుకే కవి

నేటి బాలలు దేపటి పౌరులు కావటమే కాదు/ నేటి పసినిర్భాగ్యులే రేపటి హంతకులు (పు:7) అన్నాడు. 'భయం' కవితలో కూడా కవి పసిపిల్లల దుస్థితిని వర్ణించుతూ పసి వాళ్ల ముఖంలో స్వర్గం/ కళ్లలో దైవత్వం కన్నా/ మనిషంతా ఆశ/ కడుపంతా ఆకలి కావటం సత్యం/ ఆకలికి ప్రాణం పోసి వీధుల్లో తిప్పాలంటే/ నిజం చెప్పొద్దు / పిల్లల్ని కనాలంటే భయం (పు: 12).

పాలకులెవరైనా నిరంతరం తాము సాధిస్తున్న ప్రగతిని గురించి ప్రచారం చేసుకుంటూ ఉంటారు. విమర్శనాత్మక దృక్పథం గల రచయితలకు పాలకుల ప్రచారం పట్ల అసమ్మతి ఉంటుంది. అందువల్ల వాళ్లు ప్రశ్నలు లేవనెత్తుతారు.

ఉన్నది ఉన్నట్టే ఉండటమా?/ దోచుకోవటమాని/ దోడి దీని చట్టబద్ధం చేయటమా?/ దొంగలే దొరలు కావటమా? మోసమే శాసించటమా?/ ఏది అభ్యుదయం? (పు: 14) ఈ ప్రశ్న స్వాతంత్ర్యానంతర భారతీయ రాజకీయ వ్యవస్థ మీద వేసిన ప్రశ్న. స్వతంత్ర భారతం మీద అనేక విమర్శనాత్మక కవితలు రాసిన కొలకలూరి, స్వతంత్ర భారతం ఎలా ఉండాలో కూడా చెప్పారు. 'చిరంజీవి మానవుడు' కవితలో.

భారతదేశం పచ్చి బాలెంత/ సహనం శాంతి పళ్లుపూలు/ ధర్మం న్యాయం పసుపు కుంకుమ (పు:28). అభ్యుదయ కవులు సంక్రాంతి, ఉగాది వంటి పర్వదినాలను సైతం సామాజిక వాస్తవికతా చిత్రణనే ఉపయోగించుకుంటారు. శ్రమ తీగల మీద/ మొలచిన పూవు వంటి ఆనందం/ కష్టం పైరు మీద/ నిలిచిన పంట వంటి ఆనందం (పు:34) అంటూ సంక్రాంతిని వ్యవసాయం ఉపమానంగా వర్ణించిన కొలకలూరి, సంక్రాంతి సందర్భంగా వచ్చే హరిదాసులను, గరిగే కోడిపందాలను చిత్రించారు. ఏది నిజమైన సంక్రాంతో చెప్పి కవితను ముగించారు.

పల్లెలంతా అంటే/ బిచ్చగాళ్ల కడుపులు/ నిండిన లోగిళ్లయితే/ ఆకలి చలిమంటలు/ వీధుల్లో చల్లారితే/ అపుడే దేశానికి సంక్రాంతి (పు:37) పండుగలు పండుగల కోసం కాక , మానవ సంక్షేమం కోసం సందర్భాలు కావాలని కవి ఆకాంక్ష. 'ఇదేం కొత్తకాదు', 'ఈ ఉగాది కవితలలోనూ కొకలూరి ఈ పనీ చేశారు. ఈ ఉగాది ఇలా ఉండటానికి/ ఉల్లిపాయ రేటే కారణం (పు: 84) అరవై పేజీల నోట్‌బుక్‌లో ఇది సరి కొత్తపుట/ ఇది బీదవాడికి చెదలు తిన్న పుస్తకం/ ఉన్నవాడికి కాలికో బైండు గ్రంథం (పు:99)

కొలకలూరి కవిత్వంలో, జాషువా కవిత్వంలో లాగే, దళిత సంవేదన ఒక ప్రధాన అంతర్భాగం. అవకాశమున్న చోటల్లా దళితుల స్థితిగతులను చిత్రించారు. కాలక్రమంలో దళితులలో వస్తున్న చైతన్యాన్ని 'జాగ్రత్త!' కవితలో చూపించారు. నిన్న కాళ్లు పట్టుకొన్నవాడు/ ఇవాళ జుట్టు పట్టుకొంటున్నాడు/ ఊరి వెలుపల ఉన్నవాడు/ ఊరిని వెలివేస్తున్నాడు (పు:38) అంతేకాదు కొలకలూరిలో మూలవాసి భావన బలంగా ఉంది. భారతదేశ మూలవాసులైన దళితులు, తమ నేల మీద తాము పరాయీకరించ బడ్డారన్న ఆవేదన ఉంది. "భూకంపం" కవితలో పరాయీకరణ నుండి విముక్తిని కోరుకున్నారు.

సొంతగడ్డ మీద విదేశీయుల్లా ఉండలేను/ నా భూమి నాకు కావాలి/ నేనున్నా లేకున్నా నా యీ నేల నాకుండాలి (పు:32) ప్రగతిశీల కవిది విమర్శనాత్మక గొంతుక. భారతదేశానికి స్వతంత్రం వచ్చి ఇరవైఅయిదేళ్లు అవుతున్నా/అత్యంత పురాతనమైన కులమతసమస్యలు పరిష్కారం కాకపోవడం కవి అధిక్షేపానికి గురైంది. 'ప్రగతి కవిత'లో స్వాతంత్ర్య రజతోత్సవాలను వర్ణించి: మతం ఊర చెరువు గట్టుమీద/ రావిచెట్టు కింద మండుతూ ఉంది/ కులం ఊరబావి చప్టా మీద/ అంటుకొంటూ ఉంది/ ఉన్నతనం లేనితనాన్ని/ ఊరెలపల బాదుతూ ఉంది. (పు: 49).

ఆర్థిక, సాంఘిక అసమానతలకు నిలయమైన భారతీయ గ్రామం క్రమంగా మానవీయంగా మారతాయని కవి ఆశను వ్యక్తం చేశారు, భూస్వామ్య వ్యవస్థలో రాజును భూమికి పతిగా కీర్తించింది. ఎందరు రాజులైనా భూమికి పతులే. ఈ భూస్వామ్య భావనను కొలకలూరి 'నువ్ నాకేమోతావ్?' కవితలో ప్రశ్నించారు. ప్రజాస్వామ్య యుగానికి పనికిరాని భావనను కవి అధిక్షేపించాడు.

భూపతి కొడుకు భూపతి/ భూపతి తండ్రి భూపతి/ భూపతులందరికీ పెళ్లానివా? (పు: 58) 1978 నాటి దివిసీమ ఉప్పెన సృష్టించిన విధ్వంసం తెలుగు కాల చరిత్రలో మరువలేనిది. కొన్ని గంటలలో కొన్ని వేల మంది జనం శవాలయ్యారు. ప్రకృతి విధ్వంసం జరిగింది. కొన్ని లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆ ఉప్పెనను కొలకలూరి 'ఇదెక్కడి శక్తి' కవితలో ఆర్ద్రంగా ఆవిష్కరించారు. 18 అడుగుల ఎత్తులో సముద్ర కెరటాలు రావడాన్ని 'నీట గోడ నడుస్తుందా?' (పు:71) అని ప్రశ్నించారు. ఆ ఉప్పెన సృష్టించిన విధ్వంసాన్ని వేళ ఏళ్ల/ మనిషి నాగరికతా ఆశా సౌధం/ ఒక్క అల/ ఒక్క నిమిషం/ ఇంత శూన్యం (పు:73) అని పొడి వాక్యాలలో ఆవిష్కరించారు. ఈ కవిత రెండో ప్రపంచ యుద్ధ బీభత్సం మీద పికాసో వేసిన గుయెర్నికా పెయింటింగును తలపిస్తుంది. చివరికి మనిషి ప్రకృతి విలయాలను జయించాలని కవి కోరుకున్నాడు.

ప్రకృతిని జయించే మనిషి/ పరాభవం పొందరాదు. భవిష్యత్తును శాసించే మనిషి/ ప్రకృతికి ఓడిపోయాడు (పు: 77) ప్రగతిశీల కవి మానవ సమాజంలోని పర పీడన పరాయణత్వాన్ని ఎత్తిచూపి, పీడన కాని సమసమాజ నిర్మాణానికి పిలుపునిస్తాడు. 'ఇంకానా?' కవితలో కొలకలూరి పెద్ద వాహనాల వాళ్లు చిన్న వాహనాల వాళ్లనూ, పెద్ద ఉద్యోగులు కింది ఉద్యోగులను ఎలా పీడిస్తారో చెప్పి పాఠకులకు సమాజం ఎలా ఉందో చూడమన్నాడు. 'ఇంకానా' అనే ప్రశ్న శ్రీశ్రీ 'ఇంకానా? ఇకపై చెల్లదు' అన్న మాటను తలపిస్తూ, పీడన లేని మానవీయ సమాజ కాంక్షను కలిగిస్తుంది. కొలకలూరి వారే 'దగ్ధ శిల' కవితలో తనకు ఎలాంటి సమాజం కావాలో చెప్పారు.

ప్రేమిస్తే గుండె/ పండుతుంది/ ద్వేషిస్తే మండుతుంది. (పు: 89) అంటూ ప్రేమ పునాది మీద నిర్మితమైన ప్రజాస్వామిక వ్యవస్థను ఆకాంక్షించారు. అదే సమయంలో కవి సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిని ఆహ్వానిస్తున్నాడు. మార్పులను ఆహ్వానించని కవి ఆధునిక కవి కాదు. కొలకలూరి మారని సమాజాన్ని అధిక్షేపించడమే కాక, మారుతున్న సమాజాన్ని ఆహ్వానిస్తాడు.

వేల ఏళ్లకాలం/ వేసిన ముతక సంప్రదాయాల సంకెళ్లు/ వందలేళ్ల నాగరిక జీవితం/ వడ్డించిన ముడి ఆచారాల బండరాళ్లు/ ఛేదిస్తూ తొలగిస్తూ/ ఇవాళ మనిషి విజృంభిస్తున్నాడు (పు: 100). సాధారణంగా ఇతరుల చేత ద్వేషించబడే వాళ్లు తమను ద్వేషించే వాళ్లను సహించరు. భారతదేశంలో నిచ్చెన మెట్ల వ్యవస్థలో కింది మెట్టు మీదికి నెట్టివేయబడ్డ వారు దళితులు. వాళ్లు సహజంగా "నాకే దేశమూ లేదు" అని ఆక్షేపించాలి. ప్రగతిశీల కవి ఎప్పుడూ దేశాన్ని ద్వేషించడు. వ్యవస్థను విమర్శిస్తాడు. కొలకలూరి 'ప్రేమిస్తున్నాను' కవితలో భూషించినా దూషించినా/ స్వాగతం పలికినా వీడ్కోలు పలుకుతూ/ సన్మానించినా ఏడ్పించినా/ నా యీ దేశాన్ని ప్రేమిస్తున్నాను. (పు:108) అని ప్రకటించారు, 'షరామామూలే' కావ్యం నాలుగున్నర దశాబ్దాల నాటి భారతీయసమాజం చిత్రాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యే వాక్య విన్యాసంతో ఆవిష్కరించింది. ఆ 'షరామామూలే' ఇంకా కొనసాగుతూ ఉన్నది.

మొదట్లో ఉదహరించిన కవిత కొలకలూరి ఇనాక్ 'మరో ప్రపంచ' దర్పణం. భారతీయ సమాజం నిచ్చెనలో చివరి మెట్టు మీదకి నెట్టబడిన దళితులకు రాజ్యాధికారం రావాలి. అతి నిరాఘాటంగా కొనసాగాలి. అయితే ఆ దళిత పాలకులు అవినీతికి పాల్పడకుండా పాలన సాగించాలి. ఇది ఒక విప్లవాత్మకమైన ఆకాంక్ష. రాజ్యాధికారం కావాలి, కావాలి అని కోరుకోవడం ఒక ప్రజాస్వామిక ఆకాంక్ష. అయితే రాజ్యాధికారం వస్తే ఎలాంటి పాలన అందిస్తావు అంటే అవినీతి లేని పాలన అనే భరోసా ఇవ్వాలి. కేవలం రాజ్యాధికారమే అయితే అది ఎవరు కోరుకున్నా ఒకటే. అది షరా మామూలే! పళ్లు రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏం? అన్నట్లవుతుంది. అందువల్ల దళితులకు రాజ్యాధికారంతో పాటు అవినీతి లేని పాలన కూడా అజెండాలోకి రావాలి. కొలకలూరి 1970 లలోనే దీనిని ప్రస్తావించడం ఆయన ముందు చూపునకు నిదర్శనం.

ఆర్తీ స్ఫూర్తీ నిండిన కవిత్వం

గ్రంథ సమీక్ష

ప్రగతిశీల వర్ధమాన తెలుగు కవుల్లో సాంబమూర్తి లండ ఉన్నతశ్రేణి కవి. ఆయన తన తొలి కవితా సంపుటి 'గాజురెక్కల తూనీగ' ఇటీవలే ప్రచురించాడు. సాంబమూర్తి కవిత్వానికి కొన్ని ప్రత్యేక వ్యక్తిత్వాలున్నాయి. అందువల్ల తనకవిత్వం చర్చనీయమైంది. సాంబమూర్తి నిస్సందేహంగా ప్రజాపక్షపాతి. తను జీవితాన్ని యుద్ధంగా భావిస్తాడు. ఆ యుద్ధాన్ని అమితంగా ప్రేమిస్తాడు. తనకు స్మశానం ఒక యుద్ధశిబిరంగా కనబడుతుంది. జీవితంలో ప్రతి ఒక్కరికీ కులాసాగా నవ్వుకోవాలనే ఉంటుందనీ, ఐతే పేదరికం వల్ల అది సాధ్యం కాదనీ, అందువల్ల "బంధాల చెట్టు పైనుండి/ ఒక ఆకులా రాలిపోయేటప్పుడైనా/ నవ్వుతూ వెళ్లిపోవాలి" అని ఒక నిరాశాపూరితమైన ఆశావహ దృక్పథాన్ని వెల్లడిస్తాడు. బతుకులోని అనుభవాలన్నీ గొంగళిపురుగులే. ఐనా ఆ గొంగళిపురుగులకు "కవిత్వం అనే రెక్కలు తొడిగాను/ అవి అందమైన సీతాకోకచిలుకలయ్యాయి (కవిత్వం ఒక దీప్తి)" అంటాడు సాంబమూర్తి. జీవితాన్ని చూసి ఆర్తి చెందుతున్న కవికి కవిత్వం వెలుగులు పంచి ఓదార్పునిస్తుంది.

సాంబమూర్తికి బాల్యం అంటే చాలాఇష్టం. ప్రపంచ మంతా నిద్రిస్తున్నప్పుడు కవి తానుమేల్కొని ప్రపంచాన్ని నిజాలతో మేల్కొలుపుతుంటాడని అంటాడు. అతడు ఒక జాతీ ఒక దేశం అనకుండా సమాజంలో మానవమృగాల్నీ, కుతంత్రాల్నీ, అణ్వాయుధాల్నీ, మూఢనమ్మకాల్నీ ఎదిరించి పోరుతుంటాడనీ, బలహీనుల "అందరి నిస్సహాయతల్నీ/ తానొక్కడే భుజాన మోస్తూ నడుస్తుంటాడనీ" చెబుతాడు. 'అంతం లేని వేదన' కవితలో ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల కల్లోలాన్ని చూసి చలించిపోతాడు. పాఠకుడిని కన్నీరు పెట్టిస్తాడు. వ్యాధి మూలాలు వెతికించి చికిత్స చెయ్యించాల్సిన పాలకులు పరామర్శలు, ఓదార్పులు, వాగ్దానాలతో పొద్దుబుచ్చడాన్ని ఎద్దేవా చేస్తాడు.

సాంబమూర్తి స్త్రీపక్షపాతి. అందువల్ల ఆయనకి తల్లిదండ్రులు పెట్టినపేరు వందకువందశాతం సార్థకమైంది. తన్ను తాను ఒక స్త్రీమూర్తిగా భావించుకుని "యుద్ధం నాకు కొత్తగాదు/ ప్రతిరోజూ ప్రతిగంటా యుద్ధం చేస్తూనే ఉన్నాను... రేపు కొత్తగా చిగురించడానికి/ ప్రతి రాత్రీ యుద్ధం చేస్తూనే ఉన్నాను" అంటాడు. ప్రేయసి తన మనిషి అనే ప్రేమభావన, తనని మెప్పించాలనే కోరికా మనిషి విజయానికి ప్రేరణ ఇస్తాయని అతని నమ్మకం. అందుకే "ప్రపంచం నన్ను కీర్తించినప్పుడల్లా/ నవ్వుతూ నీ వైపు చూస్తాను" అని తన ప్రేయసితో అంటాడు. అలా తన విజయం వెనుక ఉన్న తన స్త్రీని గుర్తించే సహృదయం సాంబమూర్తికి ఉంది. 'నేనామె అశ్రువును' కవిత చదివితే స్త్రీలతో అతడెంత మమేకమవుతాడో తెలుస్తుంది.

సాంబమూర్తికి నగరజీవితం పట్లా, విచ్చలవిడిగా జరుగుతున్న నగరీకరణపట్లా సహేతుకమైన వ్యతిరేకత ఉంది. టైటిల్ కవిత 'గాజు రెక్కల తూనీగ'లో నగరంలో మనిషి మనిషికి ఎదురుపడ్డం అరుదైన దృశ్యమంటాడు. "ప్రేమగా పలకరించుకోడం/ మెత్తగా నవ్వుకోవడం/ పెద్దగా అలవాటులేని నగరంలో/ పల్లెల్లోంచి వచ్చిన/ పచ్చని సీతాకోకచిలుకలు/ ఉక్కిరిబిక్కిరవుతుంటాయి" అని వాపోతాడు. "సౌఖ్యాలూ సౌకర్యాలూ/ విరగకాసిన మహా నగరంలో/ అంతెత్తున నిలబడ్డ/ ఆకాశహర్మ్యాల నీడల మధ్య/ జీవితం మాత్రం ఎప్పటికీ గాజు రెక్కల తూనీగే" అంటాడు. 'కొత్తకవిత్వం' కవితలో మరమనుషులు, ప్లాస్టిక్ నవ్వులు ఉండే నగరాల్లో కవిత్వం రాసుకోడానికి కూడా ఏమీ లేదనీ, పల్లెల్లోకి పోయి జవసత్వాలని నింపుకుని కొత్తకవిత్వం రాసుకుందాం అని పిలుపునిస్తాడు. నగరం మరమనుషులున్న మహారణ్యం అనీ ఇక్కడ ఓదార్పును ఆశించకు అని వాస్తవాన్ని చెబుతాడు.

గ్రామీణ జీవితం పట్ల సాంబమూర్తికి ఎనలేని అభిమానం ఉంది. జీవితాన్ని నిరాశ, వైవిధ్యలేమి అలముకున్నప్పుడు "పట్టణాల పొలిమేరలు దాటి/ నగరాల రణరంగాన్ని విడిచి/ నిన్నెత్తుకుని లాలించిన/అమ్మలాంటి సొంతఊరు బాటపట్టాలి" అని పిలుపునిస్తాడు. నగరంలో తనమిత్రునికి కూడా చెప్ప కుండా దాని నల్లని నీడల్ని వదిలి బయటపడి గ్రామసీమల్లోకి వెళ్ళిపోతాడు. అతనితో వస్తే గ్రామ సౌందర్యాన్ని చూపిస్తా నంటాడు. ఆ చూపించ బోయే వాటిల్లో "వరి కంకుల్ని కోస్తున్న/ కొడవళ్ళ పవిత్ర శబ్దాన్ని వినిపిస్తాను" అంటాడు. ఐతే ఇప్పుడు గ్రామం ప్రపంచీకరణ చేతుల్లో, సాంకేతికత మోజుల్లో పడి ఒక్క పూట కూడా ఆతిథ్యం ఇవ్వలేనంతగా మారిపోయిందని, అందుకే అలాంటి గ్రామంలో ఉండలేక రాత్రికి రాత్రే తిరిగొచ్చేశానని బాధపడతాడు.

సాంబమూర్తి ఒక టీచరుగా పిల్లల్లో విశ్వమానవ సోదరత్వాన్ని నూరిపోయాలని చూస్తాడు. దానికి భిన్నంగా నేడు దేశంలో పెరిగిపోతున్న జాత్యహంకార ఫాసిస్టు ధోరణుల్ని, పాఠ్యపుస్తకాల కాషాయీకరణని నిరసిస్తాడు. "చరిత్ర పుస్తకాలకు/ రంగులద్దే బృహత్కార్యం మొదలైంది" అని ఎద్దేవాచేసి, "నువ్విక/ వక్రభాష్యాల ఛిద్ర కవచాల్ని చీల్చే/ ఖడ్గవిన్యాసం చూపక తప్పదు/ నిజమైన త్యాగాన్నీ దేశభక్తినీ/ భావితరాలకు చేర్చేందుకు/కంకణబద్ధుడివై అడుగేయక తప్పదు" అని ప్రబోధంచేస్తాడు. "ఎన్నిసార్లు మరకలు పడినా..." లాంటి కవితల్లో మన ఎన్నికల వ్యవస్థలోని లొసుగుల్ని, ఎన్నికల రోజుల్లో జరిగే అకృత్యాల్ని చూసి వ్యథ జెందుతాడు. మనం గొప్పగా చెప్పుకునే దేశపు నగ్నత్వం ఎన్నికలప్పుడు బయటపడు తుందని సూచిస్తాడు. సాంబమూర్తి మనిషితనాన్ని ఎంతప్రేమిస్తాడో మనిషంటే అంత భయపడతాడు. మనిషి పట్ల అతని భయమేంటో, భూమ్మీద మనిషిఎంత భయంకరమైన జీవో తెలుసుకోవాలంటే అద్భుత మైన శిల్పం, అభివ్యక్తితో అల్లిన 'మనిషి కథ' పద్యం చదవాలి.

ఈ నిచ్చెనమెట్ల అసమసమాజాన్ని చూసి ఎంత నిరాశ చెందుతాడో అంతఆశావాదం వెదజల్లుతాడు సాంబమూర్తి. యుద్ధం నాకు కొత్తకాదు, బతుకుపాటకు కొత్త చరణం లాంటి కవితలు చదివితే సాంబమూర్తి ఎంత ఆశావాదో తెలిసొస్తుంది. అతడు జీవితాన్ని చెట్టుతో పోల్చి, "నేలతల్లి గర్భం నుండి మొలకెత్తినప్పటి/ మొట్టమొదటి పాఠాన్ని/ కూలిపోయిన ప్రతిసారీ/ చెట్టు మళ్ళీ మళ్ళీ వల్లెవేస్తూనే ఉంటుంది" అని మనిషి వెన్నుతట్టుతాడు. అది ఆశావాదానికి పతాకస్థాయి అభివ్యక్తి. కవిత్వ రచనా భ్యాసంలో కవి పడే యాతననీ, అంతరంగంలో కలిగే భావాలకు కవిత్వరూపం ఇచ్చే క్రమంలో అతడు పడే ప్రసవవేదననీ 'కవిత్వంలేని కవిత', 'లెక్కలేదు' 'కొత్త కవిత్వం' కవితల్లో ప్రతిభావంతంగా ఆవిష్కరించాడు. దానికి ఆయన చెప్పిన "కవిత్వంలేని కవితలో/ ప్రాకుతున్న పసిపాప/ గోడలు పట్టుకుని లేస్తున్నప్పటి/ ఒక వెలకట్టలేని ప్రయత్నం/ ...కనబడ్డాయి" లాంటి పోలికలు ఎంతో ఆకట్టుకుంటాయి.

సాంబమూర్తి ఓటమినీ, దుఃఖాన్నీ ప్రేమిస్తాడు. ప్రపంచీకరణ విషఫలితాల్ని, జీవితంలో పెరిగిన వేగాన్ని, అర్థం పర్థం లేని అహంకార పూరితమైన జాతీయాభి మానాన్ని, గతమెంతో ఘనమని ఒట్టిగొప్పలుపోడాన్ని చూసి చిరాకుపడతాడు. సాంబమూర్తి ఊహలు చాలా కమ్మగా ఉంటాయి. ఏకాంతం... కవితలో 'ఏకాంతంలో నేనొక/ అక్షరాల చెట్టునైపోతాను/ వాక్యాల కొమ్మలకు/ పదాల ఊయలకట్టి/ ఊగుతుంటాను" అనేది మచ్చుకొకటి మాత్రమే. స్మశానాన్ని యుద్ధశిబిరంగా చూడ్డం సాంబమూర్తికే చెల్లింది. "నువ్వు కిందపడ్డ ప్రతిసారి/ గొల్లున నవ్వినవాడూ/ నువ్వు శిఖరాన్ని ముద్దాడినప్పుడల్లా/ కుళ్ళుకుని ఏడ్చినవాడూ/ ఆప్యాయంగా/ నిన్ను కావలించుకునేదిక్కడే (యుద్ధ శిబిరం)" అని చచ్చాక రాగద్వేషాలన్నీ మటుమాయం అవుతాయన్న సాంబమూర్తి మంచి తాత్వికుడు. అయన కవిత్వమంతా ఆర్తీ స్ఫూర్తీ నిండి ఉంటుంది. సాంబమూర్తి తెలుగు దీగూట్లో వెలసిన మరో ఆశాజ్యోతి. తెలుగునేలపై మరో పొద్దుపొడుపు.

కవితశ్రీ, 9494696990

మానవతా పరిమళాలందించే కవిత్వపు తొలకరి

అనేక బాహ్యాంతర జీవన రుగ్మతలతో అనుదినం దుర్భేద్యమైపోతున్న, కల్మషమైపోతున్న మానవ హృదయంలో దారుణ మారణహోమానికి అంకురార్పణ జరగకుండా ఆ హృదయాన్ని మలయపవనాల స్పర్శతో పులకరించిపోయే నవనవోన్మేష ఉద్యానవనంగా మలచడానికి సింధువు లాంటి సాహిత్యం ఎప్పుడూ సంసిద్ధమవుతూనే వుంటుంది. దానితో బిందువు లాంటి కవిత్వమూ జతకడుతూనే వుంటుంది. అనంతంగా ఎదగడానికి విశ్వజనీనతకు పాదులు వేస్తూనే వుంటుంది. ఆ విశ్వజనీనత మహావృక్షమైతే దానినీడలో లోకమంతా హాయిగా సేదదీరాలని కలలు కంటూ విశ్వవీణ తంత్రుల్ని మీటుతూ మానవతారాగాల్ని పలికిస్తూనే వుంటుంది. మానసోద్యానాల్లో నిండుగా విరబూయడానికి మానవతాకుసుమాల సిరి అది అవుతూవుంటుంది తొలకరి. మనిషి హృదయాన్ని జోలపాడి జోకొడుతూ ఆనందతరంగాల్లో ముంచెత్తే కవిత్వమే మరోసారి ఝంఝూమారుతంలా చైతన్యాగ్నిని రగిలిస్తూ కర్తవ్యాన్నీ గుర్తుచేస్తుంటుంది. అందుకే కవిత్వానికి మానవుడే అక్షరమవుతాడు. మానవుడే సందేశమవుతాడు. మనిషి ఆనందమే కవిత్వపు అందం, ఆనందం కనుక ఆ మానవజీవన వీణలోని అపశ్రుతుల్ని సరిచేసి మమతానురాగాల రాగాల్ని పలికించడం, మనిషి హృదయపుష్పం నుంచి కరుణ మధుపాన్ని వొలికించడం తన బాధ్యతగా కవిత్వం తన భుజస్కంధాలపై వేసుకుంటుంది. అదే కవిత్వ పరమావధి. అవుతుంటుంది అది మనిషిని జీవితపు యుద్ధభూమిలో గెలిపించే రథసారథి.

'మిత్రుడా నేరం చేశాను/మిత్రుడా పాపం చేశాను
చంద్రోదయ వేళ నృత్యమంటపంలో/రాక్షసుల నృత్యహేల
దారుణం, దారుణం కారణం నేనే!'
('వక్రరేఖ' ఖండిక నుంచి)

అంటాడు వైవిధ్య కవిత్వపు ప్రవాహమై పెల్లుబికిన అజంతా. వైరుధ్యాలతో సంఘర్షణలకు లోనయ్యే మనిషి అంతరంగ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాడు కవి. మనిషి జీవితంలో క్షణం క్షణం జరిగే బీభత్సాల్ని సంలీనం చేసి చెప్పాడు. ఈ ప్రపంచంలో సంభవించే ప్రతి బీభత్సానికీ మనిషే కారకుడని వాపోతూ కవి మనిషిని మూడు పార్శ్వాలలో దర్శించాడు. ఈ ప్రపంచంలో ఏ పని అయినా మనిషే చేయడం ఒక పార్శ్వమైతే ఆ చేసిన పనికి అతడే గురికావడం రెండో పార్శ్వమవుతుంది. ఆ పనికి ఆ మనిషే పశ్చాత్తాపం చెందడం మూడో పార్శ్వమవుతుంది. ఆ పశ్చాత్తాపంలోంచి మార్పు ఆవిర్భవించాలని కవి ఆకాంక్షించాడు. చంద్రుడు ఉదయించే వేళ నృత్యమంటపంలో రాక్షసులు నాట్యం చేసే దృశ్యంలో కవి సమాజ ఘాతుక శక్తుల బీభత్సాన్ని దర్శించాడు. మనిషే ఆ బీభత్సానికి చరమగీతం పాడాలని ఆకాంక్షించాడు. అతని జీవితం వక్రరేఖ నుంచి సక్రమమైన రేఖలో పయనించాలని ఉద్బోధించాడు.

'మనిషీ! మనిషీ!/ పిట్టలకు ఎగరటం నేర్పిన
చెట్టును చూడు/ ఏ భాషలో పుష్పిస్తుందది?' ('చిలకలు వాలిన చెట్టు' ఖండిక నుంచి)

అంటూ మనిషిలోని సౌహార్ద్రతనూ, సామరస్యాన్నీ ఆర్ద్రంగా, ఆత్మీయంగా తట్టిలేపుతాడు అనుభూతి కవి ఇస్మాయిల్. చెట్టు గొప్పతనాన్నీ, దానినుంచి నేర్చుకోవలసిన పాఠాన్నీ నాలుగు వాక్యాల్లోనే తేటతెల్లం చేసేశాడు కవి. సౌహార్ద్రతకు ఈ ప్రపంచంలో చెట్టును మించిన అద్భుత ప్రతీక ఏముంటుంది?. ఏమి ఆశించి చెట్టు పిట్టలకు ఎగరధాన్ని నేర్పుతుంది!?. ప్రపంచాన్నే సమ్మోహనపరిచే పువ్వు పరిమళానికి బాష వుంటుందా!?. మానవత్వపు సుమాలను హృది నిండా నింపుకున్న మనిషి సామరస్య పరిమళాల్ని వెదజల్లడానికి ఏ భాషా అడ్డు కాకూడదని కవిత్వం తపిస్తుంది. ఈ సందేశమివ్వడానికి పిట్ట, చెట్టు, పుష్పం, ప్రకృతీ... అన్నీ తానే అయిపోతుంది. పూల పరిమళం ప్రబోధాత్మక గీతమై మనిషి గుండె లోతుల్ని స్పృశిస్తుంది. అక్కడ శతాబ్దాలుగా కరడు గట్టి గూడుకట్టుకున్న ఎన్నో జాడ్యాల పొరల్ని కరిగిస్తూనే వుంటుంది. మానవత్వమే మనిషి అసలైన జవసత్వమని దశదిశలా చాటుతూనే వుంటుంది. ఈ ప్రపంచాన్ని మానవతాధారలతో అభిషేకించాలని తపిస్తూనే వుంటుంది. కాఠిన్యపు ఊబిలో కూరుకుపోయిన మనిషి మనిషిగా రూపాంతరం చెందేంతవరకూ కవిత్వం మనిషిలో మమేకమై తన ఉనికిని చాటుకుంటూనే వుంటుంది.

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414

నితీశ్ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం

పాట్నా: ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చటమే రాజకీయంగా మార్చుకొన్న బీజేపీ, మరో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అతి త్వరలో కూల్చివేస్తామని బీరాలుపలుకుతోంది. అనేక రాష్ట్రాల్లో తెరవెనుక దుష్ట రాజకీయం నడిపి ప్రభుత్వాలను పడగొట్టి అధికారం హస్తగతం చేస్తున్న కమలం పార్టీ, ఇప్పుడు బరితెగించి బహిరంగంగానే ప్రకటనలు చేస్తోంది. బీహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని అతి త్వరలో కూల్చివేస్తామనీ, జేడీయూ-ఆర్‌జేడీ సంకీర్ణాన్ని ముక్కలు చేస్తామని బీజేపీ నేత, ఆ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ డాంబికాలు పలుకుతున్నారు. మణిపూర్‌లో ఐదుగురు జేడీయూ ఎమ్మెల్యేలను అధికార బీజేపీ శుక్రవారం తనవైపు లాగేసుకొన్నది. గతంలో అరుణాచల్ ప్రదేశ్‌లో ఏడుగురు జేడీయూ ఎమ్మెల్యేలను బీజేపీ తనలో కలిపేసుకొన్నది. ఆ రెండు రాష్ట్రాలను జేడీయూ ముక్త్ రాష్ట్రాలుగా మార్చామని, ఇక బీహార్‌ను కూడా అలాగే మారుస్తామని సుశీల్‌కుమార్ మోదీ ప్రకటించారు. జేడీయూ కూడా బీజేపీకి దీటుగా స్పందించింది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో దేశాన్ని బీజేపీ ముక్త్ భారత్‌గా మార్చటమే తమ లక్ష్యమని ప్రకటించింది. తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఒక్కటి చేసేందుకు నితీశ్‌కుమార్ దిల్లీ వెళ్లనున్నారు.

ఇటీవల బీహార్‌లో నితీశ్‌కుమార్ ఇచ్చిన షాక్‌కు బీజేపీకి దిమ్మదిరిగిపోయింది. ఆ పార్టీతో రెండున్నరేండ్ల సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన నితీశ్ ఆర్జేడీతో 24 గంటల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి బీజేపీ నితీశ్‌కుమార్‌పై రగిలిపోతున్నది. ప్రతీకారంగా మణిపూర్‌లో అలవాటు ప్రకారం ఫిరాయింపులను ప్రోత్సహించి జేడీయూను దెబ్బ తీసింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ ఆరు స్థానాల్లో గెలిచింది. వారిలో ఐదుగురు శుక్రవారం బీజేపీలో చేరినట్టు అసెంబ్లీ కార్యదర్శి ప్రకటించారు. 2019లో కూడా అరుణాచల్‌ప్రదేశ్‌లో జేడీయూను బీజేపీ అలాగే దొంగదెబ్బ తీసింది. ఆ రాష్ట్రంలో జేడీయూకు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా, అందరినీ తనలో కలిపేసుకొన్నది. బీహార్‌లో నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నా, ఆయనను దమ్మీని చేయటానికి బీజేపీ ప్రయత్నించటంతో ముందుగానే మేల్కొని ఆ పార్టీకి నితీశ్ దూరం జరిగారు.

శాసనసభలో సంపూర్ణ మెజారిటీ ఉన్న ఒక ప్రభుత్వాన్ని (మహాఘట్‌బంధన్) నిలువునా కూలుస్తామని బీజేపీ బెదిరింపులకు దిగుతున్నది. 'అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ జేడీయూ ముక్త్ రాష్ట్రాలు అయ్యాయి. అతి త్వరలో బీహార్‌లోని జేడీయూ-ఆర్జేడీ సంకీర్ణాన్ని కూలుస్తాం. బీహార్‌ను కూడా జేడీయూ ముక్త్ రాష్ట్రంగా మారుస్తాం' అని బీజేపీ నేత సుశీల్‌కుమార్ మోదీ సవాల్ చేశారు. బీజేపీ హూంకరింపులపై జేడీయూ కూడా అదే స్థాయిలో స్పందించింది. '2024లో దేశం బీజేపీ ముక్త్ భారత్ అవుతుంది' అని జేడీయూ నేత రాజీవ్ రంజన్‌సింగ్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ దుష్ట రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉన్నదని నితీశ్ అన్నారు. విపక్షపార్టీలు కలిసికట్టుగా పోరాడితే 2024 ఎన్నికల్లో బీజేపీ 50 సీట్లకు పరిమితమవుతుందని చెప్పారు.

- జేడీయూ-ఆర్జేడీ సంకీర్ణాన్ని ముక్కలు చేస్తాం
- అరుణాచల్, మణిపూర్‌లో జేడీయూను తుడిచేశాం
- బీహార్‌లోనూ జేడీయూని కూకటివేళ్లతో పెకలిస్తాం
- బీజేపీ బెదిరింపులు

టాటా సన్స్ మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ దుర్మరణం

ముంబై: టాటా సన్స్ మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ (54) మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. అహ్మదాబాద్ నుంచి ముంబై వెళ్తుండగా ఆదివారం మధ్యాహ్నం మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లాలో సూర్యనది వంతెనపై ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య రోహిఖా చగ్లా, ఫిరోజ్ మిస్త్రీ, జహన్ మిస్త్రీ అనే ఇద్దరు కుమారులున్నారు. మిస్త్రీ 1968 జులై 4వ తేదీన ముంబైలో ప్రముఖ నిర్మాణరంగ దిగ్గజం పల్లోంజీ మిస్త్రీ, పాట్సీ పెరిన్ దుబాష్ దంపతులకు జన్మించారు. మిస్త్రీ తల్లి ఐర్లాండ్‌కు చెందిన వ్యక్తి. 1930లో మిస్త్రీ తాత షాపూర్జీ మిస్త్రీ టాటా సన్స్‌లో తొలిసారి వాటాలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆ వాటా 18.5 శాతంగా ఉంది. సైరస్ మిస్త్రీ దక్షిణ ముంబైలోని ప్రముఖ క్యాథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్‌లో ప్రాథమిక విద్యభ్యసించారు. యూనివర్శిటీ ఆఫ్ లండన్ నుంచి 1990లో సివిల్ ఇంజినీరింగ్ బీఈ పట్టా పుచ్చుకున్నారు. అనంతరం లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. అనంతరం 1991లో కుటుంబ వ్యాపారమైన షాపూర్జీ పల్లోంజీ కంపెనీలో డైరెక్టర్‌గా చేరారు. 2006 నుంచి టాటా సన్స్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన, ఆయన నవంబరు 2011లో టాటా సన్స్‌కు డిప్యూటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. టాటా ఇండస్ట్రీస్ లిమిటెడ్, టాటా స్టీల్ లిమిటెడ్, టాటా పవర్ కంపెనీ లిమిటెడ్, టాటా టెలిసర్వీసెస్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ కంపెనీలకు కూడా ఆయన డైరెక్టర్‌గా వ్యవహరించారు.

హెచ్‌ఏఎల్-ఎల్ అండ్ టీ చేతికి పీఎస్‌ఎల్‌వీల తయారీ

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కోసం ఉపగ్రహ వాహక నౌక (పీఎస్‌ఎల్‌వీ)ల తయారీ కాంట్రాక్టును హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్), ఎల్ అండ్ టీ కన్సార్టియం దక్కించుకుంది. ఇస్రో అనుబంధ సంస్థ న్యూస్పేస్ ఇండియా... కాంట్రాక్టు కోసం హెచ్‌ఏఎల్, ఎల్ అండ్ టీ కన్సార్టియాన్ని ఎంపిక చేసింది. రూ.860 కోట్ల విలువైన 5 రాకెట్ల తయారీని ఈ రెండు సంస్థలు కలిసి చేపట్టనున్నాయి. పూర్తిస్థాయిలో పీఎస్‌ఎల్‌వీ రాకెట్ల తయారీని కాంట్రాక్టుకు ఇవ్వడం ఇదే మొదటిసారి. ఈ మేరకు సర్వీస్ స్థాయి ఒప్పందంపై సంతకం చేయాల్సి ఉందని, న్యూస్పేస్ ఇండియా అధికారి తెలిపారు. రెండేళ్లలోపు తొలి రాకెట్‌ను కన్సార్టియమ్ అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం పీఎస్‌ఎల్వీ తయారీకి ఉపయోగించే 80 శాతం మెకానికల్ వ్యవస్థలు, 60శాతం ఎలక్ట్రానిక్ పరికరాలు వివిధ పరిశ్రమల నుంచే వస్తున్నాయి. మిగిలిన శాతం వ్యవస్థలు ఎంతో క్లిష్టమైనవి. ఇకపై హెచ్‌ఏఎల్, ఎల్ అండ్ టీ కన్సార్టియం పీఎస్‌ఎల్‌వీ రాకెట్లను తయారుచేసి, బిగించి, ప్రయోగానికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తాయని న్యూస్పేస్ ఇండియా పేర్కొంది. జీఎస్‌ఎల్‌వీ మార్క్-3 ఉపగ్రహ వాహక నౌక తయారీని కూడా పూర్తి స్థాయిలో కాంట్రాక్టుకు ఇచ్చే ప్రణాళికలను ఇస్రో సిద్ధం చేస్తోంది.

నేడు ఉపాధ్యాయులకు జాతీయ అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ అవార్డులు గెలుచుకున్న ఉపాధ్యాయులతో సంభాషించనున్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 46 మంది ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. సోమవారం సాయంత్రం 4:30 గంటలకు విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ తన నివాసంలో సంభాషించనున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ అవార్డును అందుకోనున్న 46 మంది ఉపాధ్యాయులు అవార్డులు అందుకోనున్నారు. ఈ కార్యక్రమం విద్యా మంత్రిత్వ శాఖలోని దూరదర్శన్, స్వయం ప్రభ ఛానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. తమ నిబద్ధత , కృషి ద్వారా పాఠశాల విద్య నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా, ఆయా విద్యార్థుల జీవితాలను సుసంపన్నం చేసిన దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులకు ఈ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరిస్తారు. మూడు దశల ప్రక్రియ నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులను ప్రదానానికి ఎంపిక చేశారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

జార్ఖండ్ అసెంబ్లీలో నేడు విశ్వాస పరీక్ష

బల నిరూపణకు సిద్ధమైన సీఎం సోరెన్

రాంచీ: జార్ఖండ్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విశ్వాస పరీక్షకు సిద్ధమయ్యారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో తన ప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. తద్వారా తన ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని నిరూపించుకోనున్నారు. సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుందని, ఈ సందర్భంగా సభలో సీఎం విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారని శాసనసభ కార్యదర్శి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష బీజేపీ కూడా సమావేశాలకు సిద్ధమవుతున్నది. కాగా, సీఎం హేమంత్ సోరెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా తనకు తానే బొగ్గుగనులను కేటాయించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని, ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర గవర్నర్‌కు సూచించిందని వార్తలు వచ్చాయి. దీనిపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనే విషయమే తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

మారిన రాజకీయ పరిస్థితుల నడుమ కొద్దిరోజులుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లోని ఓ హోటల్‌లో మకాం వేసిన జార్ఖండ్‌లోని అధికార యూపీఏ సంకీర్ణానికి చెందిన 26 మంది ఎమ్మెల్యేలు ఆదివారం ప్రత్యేక విమానంలో రాంచీకి తిరిగి వెళ్లారు. ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నంలో బీజేపీ, తమ శాసనసభ్యులను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పాలక జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని కూటమి ఎమ్మెల్యేలను రాయ్‌పూర్‌కు తీసుకెళ్లారు. సోమవారం జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి శాసనసభ్యులందరూ హాజరుకానున్నారు. అధికార యూపీఏ కూటమికి చెందిన మొత్తం 32 మంది ఎమ్మెల్యేలను ఆగస్టు 30న రాయ్‌పూర్‌లోని మేఫెయిర్ గోల్ఫ్ రిసార్ట్‌కు తీసుకెళ్లారు. వారిలో నలుగురు ఈ నెల 1న జరిగిన కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు రాంచీకి తిరిగి వచ్చారు. జార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎంకు 30 మంది, కాంగ్రెస్-18, ఆర్జేడీ-1, ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీకి26 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

ధిక్కరణ కేసులో మాల్యాకు నేడు సుప్రీం శిక్ష ఖరారు

న్యూఢిల్లీ : కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ప్లేటు ఫిరాయించి రూ.9వేల కోట్ల బ్యాంకు రుణాన్ని ఎగొట్టి విదేశాలకు పలాయనం సాగించిన వ్యాపారవేత్త విజయ్ మాల్యాను ధిక్కరణ కేసులో దోషిగా నిర్ధారించిన సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు శిక్షను సోమవారం ఖరారు చేయనుంది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ ఎస్ రవీంద్ర భట్‌తో కూడిన ధర్మాసనం మార్చి 10న ఈ కేసులో తీర్పును రిజర్వులో పెట్టింది. ధిక్కరణ చట్టం, శిక్ష తదితర అంశాలపై సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ జైదీప్ గుప్తా వాదనలను విన్నది. శిక్షకు సంబంధించి రాతపూర్వక సమర్పణకుగాను మాల్యా తరపున న్యాయవాది అంకుర్ సైగల్‌కు ఒక చివరి అవకాశం ఇచ్చింది. అలా చేయలేనని అంకుర్ చెప్పడంతో మార్చి 15వరకు గడువు ఇస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేసు తీర్పును రిజర్వులో పెట్టింది. బ్రిటన్‌లో ఉన్న తన క్లయింటు వద్ద నుంచి ఎలాంటి సూచనలు లేని కారణంగా తాను నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నట్లు మాల్యా న్యాయవాది తెలిపారు. ధిక్కరణ కేసులో విధించే శిక్ష విషయంలో వాదించలేనని చెప్పారు. బ్రిటన్‌లో కార్యకలాపాలు సాగుతున్నట్లు మాకు సమాచారం ఉంది. దీనిపై ప్రతిష్ఠంభన నెలకొంది. ఏదో పెండింగ్‌లో ఉంది. అదేమిటో అంతు పట్టడం లేదు. కేసుల సంఖ్య తెలియదూ. ఇలా ఎంత కాలం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ధిక్కరణకు పాల్పడిన వ్యక్తి బ్రిటన్ ఉన్నందున అరెస్టు వారెంటు జారీ చేసినా ఫలితం ఉండదని అమికస్ క్యూరీ అన్నారు. వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరయ్యేలా మాల్యాకు అనేక అవకాశాలు ఇచ్చామని న్యాయస్థానం పేర్కొంది. 2021 నవంబరు 30 తేదీన వెలువరించిన ఉత్తర్వుల్లోనూ ఇదే విషయాన్ని ప్రత్యేకించి పేర్కొన్నట్లు తెలిపింది. గుప్తా స్పందిస్తూ మాల్యా కోర్టును ధిక్కరించారని రుజువు అయినందున ఆయనకు శిక్ష విధించాల్సిందేనన్నారు. అంతకుముందు ఎస్‌బీఐ నేతృత్వ బ్యాంకుల కాన్సార్టియం న్యాయస్థానాన్ని ఆశ్రయించి మాల్యా కోర్టు ఉత్తర్వులను అనుసరించడం లేదని, రూ.9వేల కోట్ల రుణం చెల్లించడం లేదని వెల్లడించింది. తన ఆస్తులను వెల్లడించలేదని, వాటిని స్టే ఉత్తర్వులకు వ్యతిరేకంగా తన పిల్లల పేరుమీద పెట్టేశారని ఆరోపించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. కాగా 2016 మార్చిలో మాల్యా బ్రిటన్‌కు వెళ్లిన విషయం విదితమే.

ఎమ్మెల్యేలను కొని సంఖ్య పెంచుకున్నారు

అమిత్ షా వ్యాఖ్యలకు సీపీఎం కౌంటర్

తిరువనంతపురం: ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు అంతరించిపోయే దశలో ఉన్నాయని దేశంలో బీజేపీదే భవిష్యత్తు అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు సీపీఎం గట్టి కౌంటర్ ఇచ్చింది. ప్రతిపక్ష పార్టీల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేయడం ద్వారా మాత్రమే బీజేపీ తన సంఖ్యను పెంచుకోగలిగిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు. ప్రతిపక్షాల నుంచి మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేయడం ద్వారా మాత్రమే కాషాయ పార్టీ తన సంఖ్యను పెంచుకోగలిగిందనీ, తద్వారా అవినీతి రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. 2016లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లతో బీజేపీ నేమమ్ స్థానాన్ని గెలుచుకోగలిగిందన్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఆ స్థానాన్ని కూడా కోల్పోయి చతికిలపడిందని గుర్తుచేశారు. కేరళలో కమలం వికసిస్తుందంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ గతంలో ఇక్కడ వికసించిన ఏకైక కమలం కుళ్లిపోయిన సంగతి బహుశా ఆయనకు తెలియదేమో అని బేబీ అన్నారు. కేరళలో బీజేపీ పరిస్థితి ఇలా ఉందనీ, ఈ పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆయన కోరిక కేవలం పగటికలేనని చెప్పారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అంతర్థానమవుతున్న నేపథ్యంలో కేరళలో బీజేపీకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అమిత్ షా శనివారం తిరువనంతపురంలో వ్యాఖ్యానించారు. బీజేపీ ఎస్సీ మోర్చా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు అంతరించిపోయే దశలో ఉండగా, భారత్ నుంచి కాంగ్రెస్ కనుమరుగవుతోందన్నారు.

కేరళలోనూ బీజేపీదే భవిష్యత్తు అని ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడూ ఎస్సీల సంక్షేమం కోసం పనిచేయలేదని విరుచుకుపడ్డారు. కేవలం వారిని ఓ ఓటు బ్యాంకుగానే చూశారని అమిత్‌షా ఆరోపించారు. అట్టడుగు వర్గాల వారి కోసం ఇప్పటి వరకు ఏం చేశారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలన్నారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా సాధించడమే మా పార్టీ ధ్యేయం: ఆజాద్

జమ్మూ: కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్... కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జమ్మూ శివారు సైనిక్ కాలనీలో ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీలో కొత్త పార్టీపై ప్రకటన చేశారు. దిల్లీ నుంచి ఆదివారం బయల్దేరిన ఆజాద్, ఉదయం 11 గంటలకు జమ్మూకు చేరుకున్నారు. ఆయన అనుచరులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో విమానాయశ్రానికి తరలి వచ్చి ఆజాద్‌కు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో ఆజాద్ మాట్లాడుతూ... జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణే ప్రధాన ధ్యేయంగా తన పార్టీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. భూములు, ఉద్యోగాలపై హక్కులు స్థానికులకే ఉండేలా పోరాడతామని చెప్పారు. 'పార్టీకి ఇప్పుడే ఇంకా పేరు నిర్ణయించలేదు. పార్టీ పేరు, జెండా గుర్తులను ఇక్కడి ప్రజలే నిర్ణయిస్తారు. అందరికీ అర్థమయ్యే హిందుస్థానీ పేరునే పార్టీకి పెడతాం' అని ఆజాద్ తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్... తమ రక్తంతో తయారైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు కొందరు తనను అగౌరపర్చేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ వారి ప్రయత్నాలన్నీ కంప్యూటర్లు, ట్వీట్లకే పరిమితమవుతాయని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. 'మా రక్తంతో కాంగ్రెస్ తయారైంది... కంప్యూటర్లు, ట్విట్టర్ ద్వారా పార్టీ తయారు కాలేదు... కొందరు మమ్మల్ని అవమానించేందుకు ప్రయత్నిస్తున్నారు...వారి ప్రయత్నాలన్నీ కంప్యూటర్లు, ట్విట్టర్‌కే పరిమితమవుతాయి... కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడానికి కారణం అదే... ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు బస్సుల్లో జైలుకు వెళ్తున్నారు... డీజీపీ, కమిషనర్లకు ఫోన్ చేసి తమ పేర్లు రాయించుకొని గంటలో బయటకు వస్తున్నారు... అందుకే కాంగ్రెస్ పుంజుకోలేకపోతోంది' అని ఆజాద్ వ్యాఖ్యానించారు.

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం... మోదీ ప్రభుత్వానికి సోదరులు

జైరాం రమేశ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ఇద్దరు సోదరులు 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం' కాగా మరో ఇద్దరు సోదరులు ఈడీ, సీబీఐ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. దిల్లీలోని రామలీలా మైదానంలో ఆదివారం జరిగిన మెహంగాయి పర్ హల్లా బోల్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల కోసం ఈ ర్యాలీని నిర్వహించలేదని చెప్పారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లు ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై గళాన్ని మరింత బిగ్గరగా వినిపించేందుకు నిర్వహించినట్లు ఉద్ఘాటించారు. ఆగస్టు 5న కూడా ధరల పెంపును నిరసించగా రాహుల్ గాంధీతో పాటు 70 మంది ఎంపీలు నిర్బంధానికి గురైనట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వానికి తమ గళాన్ని వినిపించేందుకు 12-13 రాష్ట్రాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారన్నారు. జమ్మూలో ఆదివారం జరిగిన గులాం నబీ ఆజాద్ ర్యాలీ గురించి మాట్లాడనని చెప్పారు. తాను కాంగ్రెస్ ర్యాలీ గురించి మాట్లాడతానని, బీజేపీ ర్యాలీ గురించి కాదంటూ వ్యాఖ్యానించారు. అవినీతిపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందన్న బీజేపీ ఆరోపణలను తోసిపుచ్చారు. ఏడాదికిపైగా ధరల పెంపుదలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని జైరాం రమేశ్ తెలిపారు. ' జైపూర్‌లో ర్యాలీ జరిగినప్పుడు 70 మంది ఎంపీలు విజయ్ చౌక్ వద్ద నిర్బంధానికి గురయ్యారు. పార్లమెంటు లోపల, బయట ఈ అంశాలను లేవనెత్తాం. అనేక రాష్ట్రాల్లో ఆందోళనలు నిర్వహించాం. అందులో భాగంగానే ఈ ర్యాలీని నిర్వహిస్తున్నాం. సెప్టెంబరు 7 నుంచి భారత్ జోడో యాత్రను కూడా ఇదే లక్ష్యంతో చేపడుతున్నాం. ఆర్థిక అసమానతలను ప్రధానంగా ప్రస్తావిస్తాం' అని జైరాంరమేశ్ అన్నారు.

రామన్ మెగసెసె అవార్డును తీసుకోలేను

కేరళ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి శైలజ

తిరువనంతపురం/న్యూదిల్లీ: ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసె అవార్డును స్వీకరించేందుకు సీపీఎం నేత, కేరళ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి కేకే శైలజ నిరాకరించారు. సీపీఎం అధిష్ఠానం నిర్ణయం మేరకు అవార్డును తిరస్కరించారు. ఆమె తన పదవీకాలంలో నిపా, కోవిడ్ నివారణలో చేసిన కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అయితే శైలజ ఈ అవార్డును స్వీకరించలేనని నిర్వాహక కమిటీకి తెలియజేశారు. 'నాకు మెగసెసే అవార్డు కమిటీ నుంచి లేఖ అందింది. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలిగా నేను దీనిపై మా పార్టీతో చర్చించాను. మేము అంతా కలిసి ఆ అవార్డును అంగీకరించకూడదని నిర్ణయించుకున్నాము' అని శైలజ తెలిపారు. 2016 నుంచి 2021 వరకు, నిపా, కోవిడ్-19 నివారణకు రాష్ట్రం చేసిన పోరాటంలో భాగంగా కేరళ ఆరోగ్య మంత్రిగా శైలజ ప్రశంసలందుకున్నారు. ఆమె పనితీరును పరిగణనలోకి తీసుకున్న మెగసెసె అవార్డు కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డును నిరాకరించడంపై శైలజ మీడియాతో మాట్లాడుతూ... తాను అవార్డును స్వీకరించకూడదనేది సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమష్టి నిర్ణయమని స్పష్టం చేశారు. 'మెగసెసె (ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు) కమ్యూనిస్టు వ్యతిరేకి... ఒక వ్యక్తిగా నన్ను అవార్డుకు పరిగణించారు... రాజకీయ నాయకురాలినైన నేను అవార్డును స్వీకరించే విషయమై పార్టీతో సంప్రదింపులు జరిపాను... నా పేరును పరిగణనలోకి తీసుకున్నందుకు నేను ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపాను. నా నిర్ణయాన్ని వారికి తెలియజేశాను" అని పేర్కొన్నారు. ఇది మొత్తం రాష్ట్రానికి దక్కిన గౌరవాన్ని నిరాకరిస్తున్నట్లుగా చూడకూడదని శైలజ అన్నారు. 'రాజకీయ నేతలకు మెగసెసే అవార్డును ఇవ్వడాన్ని నేను ఇంతకుముందు చూడలేదు... కోవిడ్-19, నిపా సమయంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు విశేష రీతిలో ప్రశంసలందాయి' అని కేరళ మాజీ ఆరోగ్య మంత్రి తెలిపారు.

దిల్లీలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ ఈ విషయమై మీడియాతో మాట్లాడుతూ... ఫిలిప్పీన్స్‌లో కమ్యూనిస్టులను క్రూరంగా అణచివేసిన చరిత్ర కలిగిన రామన్ మెగసెసె పేరు మీద ఈ అవార్డు ఉండటం సహా ఇతర అంశాల దృష్ట్యా శైలజ అవార్డును తిరస్కరించినట్లు వెల్లడించారు. కేరళలో ప్రజారోగ్య సమస్యల నిర్వహణ తీరుకు ఈ అవార్డు ఇచ్చారన్నారు. అయితే ఇదంతా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం, ఆరోగ్య శాఖ సమిష్టి కృషి అని, ఇది వ్యక్తిగత ప్రయత్నం కాదని చెప్పారు. ఇప్పటి వరకు ఏ క్రియాశీల రాజకీయ నాయకుడికి మెగసెసె అవార్డు ఇవ్వలేదని తెలిపారు.

వైద్యం కోసం ఆరు కిలోమీటర్లు మంచంపై మోసుకెళ్లారు

సియోని: ఓ మహిళను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడానికి మంచంపై ఆరు కిలోమీటర్లు మోసుకెళ్లిన ఘటన బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. గిరిజనులు అధికంగా నివసించే సియోని జిల్లాలోని ఘన్సోర్ బ్లాక్, బఖారిమల్ గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం విద్యుదాఘాతంతో గాయపడింది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి మంటలు ఎగిసి పడ్డాయి. బాధిత మహిళకు 70 శాతం కాలిన గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరు కిలోమీటర్ల దూరం మంచం మీద ఉంచి సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. తదుపరి మెరుగైన చికిత్స కోసం మహిళను జబల్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. దీనిపై శనివారం సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో స్థానిక అధికారులు దీనిపై దృష్టి సారించారు. గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సకాలంలో వైద్యం అందక రెండేళ్ల చిన్నారి మృతి

థానే: మహారాష్ట్ర థానే జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో పాము కాటుకు గురైన రెండేళ్ల చిన్నారికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందింది. శనివారం తెల్లవారుజామున షాహాపూర్‌లోని వైతర్నపాడకు చెందిన చిన్నారిని పాము కాటువేయడంతో ఆమె ఇంటికి కిలోమీటరు దూరంలోని టెంబా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడి వైద్య సిబ్బంది... ఖర్డీ గ్రామీణ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. అక్కడికి తీసుకెళ్లగా, షాహాపూర్ సబ్-జిల్లా ఆసుపత్రికి పంపారు. ఈ క్రమంలో రెండు గంటల సమయం గడిచి పోయింది. సకాలంలో వైద్యం అందకపోవడంతో చిన్నారి మృతి చెందింది. షాహాపూర్ తాలూకాకు అనుబంధంగా ఉన్న ఒక వైద్య అధికారి మాట్లాడుతూ... టెంబా వైద్య కేంద్రలో పగటిపూట పాముకాటు కేసులతో సహా 15 నుంచి 20 మంది రోగులకు చికిత్స అందించవచ్చున్నారు. అయితే అత్యవసర కేసులను నిర్వహించడానికి కేంద్రం పూర్తిగా సిద్ధం కాలేదని చెప్పారు. టెంబా ఆరోగ్య కేంద్రాన్ని అన్ని సౌకర్యాలతో ఆధునీకరించే వరకు రాత్రివేళల్లో అత్యవసర చికిత్సకోసం రోగులు నేరుగా గ్రామీణ ఆసుపత్రి లేదా ఉప జిల్లా ఆసుపత్రికి రాత్రిపూట వెళ్లాల్సి ఉంటుందన్నారు.

థాణే జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుభాష్ పవార్ మాట్లాడుతూ... ఇలాంటి సంఘటనలు జరగకుండా దిద్దుబాటు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.